

ఎరువులు.. డోంట్‌వర్రీ!

జిల్లాలో ఖరీఫ్‌కు సరిపడా నిల్వలు.. అమ్మకానికి సిద్ధంగా 56,757 మెట్రిక్ టన్నులు

ఏలూరుసిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సాగుకు సంబంధించి ఎరువులు సరిపడానే ఉన్నాయని, కొరత లేదని జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు వరితో పాటు అన్ని పంటలకు 1,18,402 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని జిల్లా వ్యవసాయ శాఖ ప్రణాళికలో పేర్కొన్నారు. దీనికి తగ్గట్టుగానే ఎరువుల నిల్వలకు సంబంధిం చి మార్క్‌ఫెడ్‌తోపాటు ఆర్ఎస్‌కే కేంద్రాలు, సహకార సంఘాలు, ఎరువుల రిటైల్, హోల్‌సేల్ డీలర్ల వద్ద ఎరువుల నిల్వలు ఉన్నాయి. మార్క్‌ఫెడ్ వద్ద ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాకముందే ఎరువుల బఫర్ స్టాక్ ఉంచారు.

ఎరువు పేరు	ఖరీఫ్‌కు కావాల్సిన ఎరువులు	జూన్‌కు అవసరమైన ఎరువులు	ప్రస్తుతం ఉన్న నిల్వలు
యూరియా	33,762	2,985	18,697
డీఏపీ	9,598	1,361	3,903
ఎన్‌పీకే	42,085	4,212	18,825
ఎంఓపీ	13,468	1,913	7,860
ఎస్ఎస్‌పీ	19,489	2,903	7,472
మొత్తం	1,18,402	13,374	56,757

ఎరువుల నిల్వలు మెట్రిక్ టన్నులలో..

వివిధ సంస్థల వద్ద నిల్వలు

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వివిధ సంస్థల వద్ద ఎరువులు నిల్వలు ఇలా ఉన్నాయి. మార్క్‌ఫెడ్ వద్ద 6,811 మెట్రిక్ టన్నులు, రైతు సేవా కేంద్రాల వద్ద 27 మెట్రిక్ టన్నులు, పీఏసీఎస్‌ల వద్ద 7,613 మెట్రిక్‌టన్నులు, రిటైల్ ఎరువుల డీలర్ల వద్ద 24,230 మెట్రిక్ టన్నులు, హోల్‌సేల్ ఎరువుల డీలర్ల వద్ద 18వేల 76 మెట్రిక్ టన్నులు నిల్వలు ఉన్నాయి. మొత్తంగా 56వేల 757 మెట్రిక్ టన్నుల ఎరువులు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. జూన్‌లో కావాల్సిన ఎరువులకంటే అధికంగానే ఎరువులు నిల్వలు ఉన్నాయని చెబుతున్నారు. 'జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువుల కొరత లేదు. ఎప్పటికప్పుడు ఎరువుల సరఫరా జరుగుతూనే ఉంటుంది. జిల్లాకు సాగు అవసరాలకు అనుగుణంగా ఎరువులు సరఫరా అవుతాయి. రైతులకు ఇబ్బందులు కలుగకుండానే ఎరువులు సరఫరా చేస్తాం' అని జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్‌బాషా తెలిపారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా.. విత్తనాలు, ఎరువుల దుకాణాల తనిఖీలు

చింతలపూడి/లింగపాలెం/చాట్రాయి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వరి విత్తనాల నాణ్యతను జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో స్వయంగా తనిఖీలు జరిపారు. పెదవేగి, లింగపాలెం, చింతలపూడి, చాట్రాయి మండలాల్లో ఆయన పర్యటించారు. దుకాణాల్లో పురుగుల మందులు, విత్తనాలు తప్ప ఇతర ఏవీ ఉంచరాదన్నారు. నాణ్యమైన విత్తనా లనే అమ్మాలని, రైతులకు విధిగా బిల్లు ఇవ్వాలని, విత్తనాల డీలర్లు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు పాటించాలని, అధిక ధరలకు అమ్మినట్టు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలన్నారు. పలు షాపుల్లో శాంపిల్స్ సేకరించారు. ఆయన వెంట చింతలపూడిలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు



చింతలపూడిలో విత్తన షాపులో తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా

బి.నాగ కుమార్, చింతలపూడి,లింగపాలెం మండల వ్యవసాయాధి కారులు కె.మురళీ కృష్ణ, ప్రదీప్‌కుమార్, ఏఈవో గణేష్ సిబ్బంది పాల్గొన్నారు.



ఏజెన్సీ.. జల్లెడ!

కగార్ ఆపరేషన్... వరుస ఎన్‌కౌంటర్లతో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఏజెన్సీలో విస్తృతంగా కూంబింగ్ చేపట్టింది. అనుమానాస్పద వ్యక్తుల వివరాలను ఆరా తీస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేశారు.

- దేశవ్యాప్తంగా కగార్ ఆపరేషన్
- వరుస ఎన్‌కౌంటర్లతో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తం
- కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం ప్రాంతాల్లో కూంబింగ్
- పోలవరం ప్రాజెక్టు పరీవాహక ప్రాంతాల్లో గట్టి భద్రత

ఏలూరు క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):కగార్ ఆపరేషన్ దేశం మొత్తం నిర్వహిస్తున్నారు. 2026 నాటికి దేశంలో మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించాలనే ధ్యేయంతోనే కగార్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. దీనిలో భాగంగా అటవీ ప్రాంతాల్లో పోలీసు బలగాలు స్పెషల్ పార్టీ పోలీసులు, గ్రేహౌండ్స్ దళాలు విస్తృతంగా దేశం మొత్తం మీద కూంబింగ్ నిర్వహిస్తున్నారు. మన రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్న చత్తీస్‌ఘడ్, ఒడిశా, తెలంగాణలలోని అటవీ ప్రాంతాలు సరిహద్దుగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఇటీవల ఎన్‌కౌంటర్‌లు చోటు చేసుకున్న నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎస్పీ కేపీఎస్ కిశోర్ పర్యవేక్షణలో కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల్లో కొద్దిరోజులుగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరుపుతున్న దృష్ట్యా ఆ ప్రాంతానికి రక్షణ కల్పించే దిశగా గోదావరికి ఇరువైపులా ప్రత్యేక కూంబింగ్ దళాలు తనిఖీలు నిర్వహిస్తూ గట్టి భద్రత కల్పిస్తున్నారు. గిరిజన గ్రామాల్లో ప్రతి ఇంటిని సోదా చేస్తున్నారు. కొత్త వ్యక్తులు ఎవరైనా వచ్చారా, ఎక్కడైనా తారస పడ్డారా అంటూ ఆరా తీస్తున్నారు. అటవీ ప్రాంతానికి వెళ్లి వచ్చే పశువుల కాపరుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. గ్రామాల్లో ఏ ఇంట్లోనైనా తమ సరిపడే ఆహారమే కాకుండా అదనంగా ఆహారాన్ని తయారు చేస్తున్నారా.. అన్న కోణంలోను ఆరా తీస్తున్నారు. పొలాలకు, అటవీ ప్రాంతానికి వెళ్లేవారిని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ఇంకోవైపు డ్రోన్లతో పరిశీలన జరుపుతున్నారు. స్పెషల్ పార్టీ పోలీసులు, యాంటీ నక్సల్స్ స్క్వాడ్, ఆర్మ్‌డు రిజర్వు విభాగాలు, బాంబు డిస్పోజల్ - మిగతా 6వ పేజీలో

ఏజెన్సీ మండలాల్లో కూంబింగ్



మారేడుమిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఎన్‌కౌంటర్ నేపథ్యంలో గోదావరి పరీవాహక ప్రాంతాలతో పాటు పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో కూంబింగ్ నిర్వహిస్తున్నాం. డ్రోన్లతో తనిఖీలు చేస్తున్నాం. పోలవరం ప్రాజెక్టు ప్రాంతాల్లోను తనిఖీలు కొనసాగిస్తున్నాం. జిల్లా ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సి పనిలేదు.

- కేపీఎస్ కిశోర్, ఎస్పీ

- జిల్లాలో గతంలో నక్సల్స్, మావోయిస్టుల కదలికలు ఉండగా ఎన్‌కౌంటర్లు కూడా జరిగాయి. 1998 నవంబరులో ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో రాత్రి 11 గంటల ప్రాంతంలో విజయవాడ నుంచి రాయగడ్ వెళ్లే పాసింజర్ రైలు నుంచి ఇద్దరు మావోయిస్టులు దిగుతుండగా వారి చేతిలో ఉన్న టిఫిన్ బాక్స్ బాంబు పేలి ఒక ప్రయాణికుడు మరణించగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులకు చిక్కిన ఇద్దరు మావోయిస్టులను విచారించి దెందులూరు మండలం కొవ్వలిలో, భీమడోలు మండలం గుండుగొలనులో వారు స్థావరాలు ఏర్పాటు చేసుకున్నట్లు గుర్తించారు. భారీగా ఆయుధాలను, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. 2000, మార్చి 17న జలతారు వాగువద్ద జిల్లాలో మొట్ట మొదటి ఎన్‌కౌంటర్ జరిగింది. జిల్లాలో ఎనిమిది ఎన్‌కౌంటర్లు చోటు చేసుకున్నాయి. మావోయిస్టు కీలకనాయకుడైన టెక్ మధు తణుకు సమీపంలోని పైడిపర్రులో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని ట్రాన్స్‌పోర్టు ఆఫీస్ అనే పేరిట ఏకంగా గ్రేనేడ్స్, రాకెట్ లాంచర్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అక్కడ వాటిని తయారు చేసి ట్రాన్స్‌పోర్టు పేరుతో మావోయిస్టులకు రవాణా చేసి అందించేవాడు. వరంగల్ పోలీసులకు అక్కడ చిక్కిన మావోయిస్టు ద్వారా మధు స్థావరాన్ని గుర్తించి పైడిపర్రులో దాడి చేసి ఉమ్మడి రాష్ట్రంలోనే సంచలనం కలిగించేలా ఆయుధాలను స్వాధీనం చేసుకుని మధును అరెస్టు చేశారు.

డీఎస్సీ పరీక్షకు 35 మంది గైర్హాజరు

నేడు, రేపు జరగాల్సిన పరీక్షలు వాయిదా

ఏలూరు అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన పరీక్షకు స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం షిఫ్టునకు 174 మంది అభ్యర్థులకు 171 మంది, మధ్యాహ్నం షిఫ్టునకు 189 మందికి 180 మంది హాజరయ్యారు. ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కేంద్రానికి ఉదయం 150 మందికి 141, మధ్యాహ్నం 140 మందికి 138, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రానికి ఉదయం 197 మందికి 193, మధ్యాహ్నం 215 మందికి 207 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం మీద 35 మంది గైర్హాజరయ్యారు.

పరీక్షలు రెండు రోజులు వాయిదా

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్న నేపథ్యంలో ఈనెల 20, 21 తేదీల్లో జరగాల్సిన మెగా డీఎస్సీ పరీక్షలను జూలై 1, 2 తేదీలకు వాయిదా వేశారు. అభ్యర్థులు హాల్‌టిక్కెట్లను ఈనెల 25నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ కోరారు.

- డీఎల్ఎడ్ 4వ సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన పరీక్షకు 46 మంది విద్యార్థులకు 45మంది హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

వెబ్‌సైట్‌లో మెరిట్ కార్డులు

రాష్ట్రవ్యాప్తంగా గతేడాది డిసెంబరులో నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలో ఎంపికైన విద్యార్థుల వెబ్ మెరిట్ కార్డులను ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు.ఎంపికైన విద్యార్థులు బ్యాంకు అక్కౌంట్ తెరిచి, ఆధార్‌తో లింక్ చేయించి, డీబీటీ ద్వారా డబ్బులు జమయ్యేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీంతోపాటు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో అప్లికేషన్‌ను సబ్మిట్ చేసి, సంబంధిత స్కూలు నోడల్ ఆఫీసర్, జిల్లా నోడల్ ఆఫీసర్ లాగిన్ ద్వారా దరఖాస్తును ధ్రువీకరించుకోవాలని సూచించారు.

మావుళ్లమ్మ జ్యేష్ఠ మాస జాతర



భీమవరంలో మావుళ్లమ్మ జ్యేష్ఠ మాస జాతర గురువారం ప్రారంభమైంది. నీరుల్లి, కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ, దేవస్థానం ఆధ్వర్యంలో తొలిరోజు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గోపాల.. గోపాల.. అంటూ శ్రీకృష్ణుడి వేషధారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

మా పాఠశాలను కొనసాగించండి..!

లేదంటే టీసీలు తీసుకోం.. కోడూరు విద్యార్థుల ఆవేదన

ముదినేపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి):'మేము మా గ్రామంలోని యూపీ పాఠశాలలోనే చదువుకుంటాం. దూర ప్రాంతాల్లోని హైస్కూళ్లకు వెళ్లలేం.. మా యూపీ స్కూలును కొనసాగించండి ప్లీజ్ అంటూ ముదినేపల్లి మండలం కోడూరు గ్రామంలో బేసిక్ ప్రైమరీ పాఠశాలగా స్థాయి తగ్గించిన మండల పరిషత్ యూపీ పాఠశాల విద్యార్థులు వేడుకుంటున్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభమైన ఈనెల 12 నుంచి ఆ పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఆరవ తరగతికి ప్రమోట్ అయిన విద్యార్థులతో పాటు ఏడు, ఎనిమిదో తరగతి విద్యార్థులు 20 మంది ప్రతీ రోజూ పాఠశాలకు వస్తూనే ఉన్నారు. తమ పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా మారిస్తే పది కిలోమీటర్ల దూరంలోని పెదపాలపర్రు హైస్కూలుకు లేదా ముదినేపల్లి హైస్కూలుకు వెళ్లాలని, చదువులైనా ఆపేస్తాం కాని కిలోమీటర్ల దూరంలోని హైస్కూళ్లకు వెళ్లలేమని వారు చెబుతున్నారు. వారం రోజులుగా ఈ యూపీ పాఠశాల నుంచి హైస్కూలుకు వెళ్లేందుకు విద్యార్థులు ఎవరూ టీసీలు తీసుకోలేదు. మండలంలోని తొమ్మిది యూపీ పాఠశాలలు బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా మార్పు చేస్తూ విద్యాశాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నా అధికారికంగా నేటికీ ఆయా పాఠశాలల హెచ్ఎంలకు ఉత్తర్వులు అందలేదు. దీంతో ఐదో తరగతి నుంచి ప్రమోట్ అయిన విద్యార్థులతోపాటు ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు టీసీలు ఇచ్చే విషయంలో వారు అయోమయంలో పడ్డారు.



పాఠశాలకు వచ్చిన 6, 7, 8 తరగతుల విద్యార్థులు



కార్మికులతో మాట్లాడుతున్న ఆర్టీసీ ఈడీ విజయరత్నం

త్వరలో 750 ఎలక్ట్రికల్ బస్సులు

ఆర్టీసీ జోన్-2 ఈడీ విజయరత్నం

నూజివీడు, జూన్ 19(ఆంధ్రజ్యోతి):ఏపీఎస్ఆర్టీసీలో నూతన సాంకేతికతను ప్రవేశపెడుతూ 750 ఎలక్ట్రికల్ బస్సులను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్టు ఆర్టీసీ జోన్-2 ఈడీ జి.విజయరత్నం తెలిపారు.నూజివీడు ఆర్టీసీ డిపోను గురువారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సర్వీసులు నడపడంలో సమయపాలన పాటించడంతో పాటు జనాదరణ ఉన్న రూట్లలో మరిన్ని సర్వీస్‌లను పెంచాలన్నారు. రాజధాని ప్రాంతాన్ని కలుపుతూ ప్రధానంగా ఎయిమ్స్ ఆసుపత్రికి ప్రత్యేకంగా ఒక బస్సును ఏర్పాటు చేసేలా యోచిస్తున్నట్టు తెలిపారు. నూజివీడు నుంచి వివిధ ప్రాంతాలకు ప్రత్యేక పార్సిల్ వ్యవస్థ ద్వారా మామిడికాయలను పంపించే విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చామన్నారు. ఆర్టీసీ డీఎం పవన్‌కుమార్ పాల్గొన్నారు.

జాయింట్ పట్టాదారుల భూముల విభజనకు రుసుం మినహాయింపు

ఏలూరు సిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి):సర్వే పూర్తి కాబడిన గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూయజమానులు వారి భూములను విభజన చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించిన రూ.500 రుసుమును పూర్తిగా మినహాయించి ఉచితంగా ఈ సేవను పొందేందుకు అవకాశం కల్పించినట్టు ధాత్రిరెడ్డి చెప్పారు. కేవలం నామమాత్రపు దరఖాస్తు రుసుం రూ.50లను గ్రామ సచివాలయంలో చెల్లించి నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీనివల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలైన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులుగా గుర్తించబడతారన్నారు.

రేషన్ కార్డుల ఈకేవైసీ 95.50 శాతం పూర్తి

ఏలూరుసిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి):రేషన్ కార్డులు(బియ్యం కార్డులు)కు సంబంధించి ఈకేవైసీ ప్రక్రియ దాదాపు పూర్తవుతోంది. జిల్లాలో మొత్తం 6,20,164 రేషన్ కార్డులు ఉండగా 17.20 లక్షల మంది సభ్యులున్నారు. వీరిలో ఇప్పటివరకు 16 లక్షల 30 వేల మంది సభ్యులకు (95.50 శాతం) ఈకేవైసీ పూర్తయిందని ఇంకా 4.5 శాతం మంది మాత్రమే ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని నివేదికలు చెబుతు న్నాయి. మిగిలిన సభ్యులకు ఈకేవైసీ కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రక్రియను వేగవంతం చేశారు. కాగా కొత్త బియ్యం కార్డులకు దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. మార్పులు, చేర్పులు తదితర ఆరు అంశాలకు 34 వేలు దరఖాస్తులు వస్తే, కొత్తగా కార్డులు కావాలని 4వేల మంది దరఖాస్తులు చేసుకున్నారు. త్వరలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కొత్త కార్డులు ఇస్తారని అధికారులు చెబుతున్నారు.

త్వరితగతిన ఈకేవైసీ పూర్తి : డీఎస్‌వో విలియమ్స్

రేషన్ కార్డులకు సంబంధించి ఈకేవైసీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేస్తాం. ఇప్పటికే 95.50 శాతం ఈకేవైసీ ప్రక్రియ పూర్తయింది. కొత్త కార్డుల జారీ ప్రక్రియకు సన్నాహాలు జరుగుతున్నాయి. త్వరలో కొత్త రేషన్ కార్డులు అందజేస్తాం.

సారా తయారీని విడిచి పెట్టిన వారికి ప్రత్యేక ఉపాధి

నేడు ఏలూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు

లోపలి పేజీలో..

నేటితో తల్లికి వందనం ఫిర్యాదుల ముగింపు

తాడేపల్లిగూడెం, జూన్ 19(ఆంధ్రజ్యోతి):అర్హత ఉండి తల్లికి వందనం డబ్బులు జమ కాని వారు ఫిర్యాదు చేసుకునేందుకు శుక్రవారంతో గడువు ముగియనుంది. లబ్ధిదారులు గ్రీవెన్స్‌ఫామ్ పూర్తిచేసి గ్రామ, వార్డు సచివాలయంలో అందజేయాల్సి ఉంటుంది. తల్లికి వందనం ఎంపికలో ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలను నిర్దేశించింది. మెట్టప్రాంతంలోని వారికి ఐదెకరాల భూమికంటే ఎక్కువ ఉండ కూడదని, డెల్టా ప్రాంతంలో మూడెకరాల కంటే ఎక్కువ ఉండకూడ దని, సరాసరి విద్యుత్ వినియోగం నెలకు 300 యూనిట్లు దాటకూడ దని, ప్రభుత్వంలో పనిచేసే ఉద్యోగులు నెలసరి జీతం రూ.12 వేలకు మించకూడదని, నాలుగు చక్రాల వాహనం ఉండకూడదని నిబంధ నలు విధించింది. లబ్ధిదారుల ఎంపిక సమయంలో కొంతమంది అర్హుల పేర్లు సైతం అనర్హుల జాబితాలో ఉండడంతో ఆందోళన చెందారు. సంబంధిత అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం దాఖలు చేస్తే పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీనితో వీటిని దాఖలు చేసేందుకు ఈనెల 16 నుంచి 20 వరకు గడువు పొడిగిం చారు. విద్యుత్ యూనిట్లు అధికంగా ఉన్నట్లు నమోదు కావడంతో సంబంధిత అధికారి ధ్రువీకరణ కోసం విద్యుత్ కార్యాలయాల వద్ద క్యూకట్టారు. విద్యుత్ యూనిట్ల వినియోగానికి సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి. నాలుగు చక్రాల వాహనాలు, పొలాల పరిమితికి సంబంధించిన ఫిర్యాదులు తక్కువ. గడువు సమీపించడంతో అధికారుల నుంచి సర్టిఫైడ్ కాపీలను సచివాలయాలకు చేర్చేపనిలో పలువురు అవస్థలు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఏపీఈపీడీసీఎల్ ఈఆర్వో కార్యాలయానికి వెళితే సంబంధిత సబ్‌స్టేషన్ పరిధి నుంచి తెచ్చుకోవాలని చెప్పడంతో దరఖాస్తుదారులు పరుగులు తీస్తున్నారు. ఈ దరఖాస్తు చేసుకున్న ఫిర్యాదులపై ఈనెల 21 నుంచి 28 వరకు పరిశీలించి అధికారులు అర్హుల జాబితా తయారు చేస్తారు. వీటిని ఈ నెల 30న గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. అర్హులందరికి వచ్చేనెల ఐదో తేదీన సొమ్ములు జమవుతాయి.

డబ్బులు ఖాతాల్లోనే ఉంటాయి

తల్లికి వందనం పథకానికి ఎంపికైన వారందరికి వారి ఖాతాల్లో నగదు జమ అవుతుంది. లబ్ధిదారులు బ్యాంక్‌ల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. బ్యాంక్, పోస్టాఫీస్ ఖాతాల్లో జమ అయితే సంవత్సరంలో ఎప్పుడైనా తీసుకోవచ్చు. లబ్ధిదారులు అవగాహన లేమితో బ్యాంక్‌లు, పోస్టాఫీస్ వద్ద డబ్బు కోసం క్యూకట్టాల్సిన పనిలేదని సంబంధిత విభాగం అధికారులు చెబుతున్నారు. వ్యక్తిగత ఖాతాల్లో సొమ్మును ఎవరూ తీసుకోవడానికి కుదరదు. దీన్ని గమనించి లబ్ధిదారులు వారికి అనువైన సమయంలో వచ్చి ప్రశాంతంగా డబ్బులు తీసుకోవచ్చని బ్యాంక్, పోస్టల్ అధికారులు సూచిస్తున్నారు. సొమ్ము వెంటనే తీసుకోకపోతే తిరిగి వెళ్లిపోతాయనే అపోహతో కొంత మంది లబ్ధిదారులు ఒకేసారి వస్తున్నారని అధికారులు పేర్కొంటున్నారు. లబ్ధిదారులు ఖాతాల్లో డబ్బుంటే ఆందోళన చెందాల్సిన పనిలేదని బ్యాంక్, పోస్టల్ అధికారులు భరోసా ఇస్తున్నారు.


డీఐవోగా డాక్టర్ శోభ

విజయవాడ డీఐవోగా డాక్టర్ నాగేశ్వరరావు బదిలీ

ఏలూరు అర్బన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి):జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐవో)గా డాక్టర్ యు.శోభ బదిలీపై జిల్లాకు నియమితులయ్యారు. జోన్-2 పరిధిలోని ఉభయగోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన పలు కేడర్ల వైద్యాధికారులు, సీనియర్ అసిస్టెంట్లకు గురువారం రాజమహేంద్రవరం రీజినల్ డైరెక్టర్ నేతృత్వంలో నిర్వహించిన సాధారణ బదిలీల కౌన్సెలింగ్‌లో ప్రస్తుతం విజయ వాడ డీఐవోగా పనిచేస్తున్న డాక్టర్ శోభను జిల్లాకు బదిలీ చేయగా, ఇప్పటివరకు డీఐవోగా సుదీర్ఘకాలం పనిచేసిన డాక్టర్ నాగేశ్వరరావును విజయవాడ డీఐవోగా బదిలీ చేశారు. ఇక జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులను పర్యవేక్షించేందుకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహిస్తున్న డెమో విభాగానికి ఇన్‌చార్జి డెమోగా పనిచేస్తున్న డిప్యూటీ డెమో నాగరత్నం మచిలీపట్నానికి బదిలీకాగా, ఆ పోస్టులో జిల్లాకు ఎవరూ నియమితులు కాలేదు. కీలకమైన డెమో పోస్టు ఏళ్ల తరబడి ఖాళీగానే ఉండగా, కొంతకాలంక్రితం డీఎంహెచ్‌వో కార్యాలయంలో రిజర్వ్ మెడికల్ ఆఫీసర్లనుంచి ఒకరిని ఇన్‌చార్జి డెమోగా నియమించినప్పటికీ, ఇంతవరకు విధుల్లో చురుకుగా వ్యవహరించిన దాఖలాలు లేవన్న విమర్శలున్నాయి. దీంతో డెమో విభాగానికి ఒక ఎంపీహెచ్‌ఈవో, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్‌మాత్రమే దిక్కని తెలుస్తోంది. శుక్రవారం మరికొన్ని కేడర్లకు బదిలీల కౌన్సెలింగ్ ఆర్డీ పరిధిలో జరగనుంది.

సొసైటీల్లో కామన్ సేవలు

లోపలి పేజీలో..







యోగాలో పాల్గొన్న కేంద్ర మంత్రి వర్మ, ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు రామాంజనేయులు, పితాని సత్యనారాయణ, కాపు కార్పోరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు



యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

దినచర్యగా చేసుకోవాలి : మంత్రి వర్మ

భీమవరం డీఎన్ఆర్‌లో 6 వేల మందితో మెగా యోగా

భీమవరం టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతిఒక్కరూ యోగాను దినచర్యగా చేసుకోవాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. గురువారం భీమవరం డీఎన్ఆర్ కళాశాల గ్రౌండ్‌లో జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి ఆధ్వర్యంలో జిల్లాకు కేటా యించిన ప్రత్యేక థీమ్ అథ్లెటిక్స్, స్పోర్ట్స్ గ్రూప్స్ యూత్ గ్రూప్స్‌తో ఆరు వేల మందితో మెగా యోగా ప్రదర్శన నిర్వహించారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘు రామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, పితాని సత్యనారాయణ, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొని ఆసనాలు వేశారు. మంత్రి వర్మ మాట్లాడుతూ యోగా సాధన వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం విశాఖపట్నంలో నిర్వహించడం మన రాష్ట్రానికే గర్వ కారణం అన్నారు. రఘురామ మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆకాంక్ష మేరకు ఆంధ్ర రాష్ట్రాన్ని ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నార న్నారు. జిల్లా అడిషనల్ ఎస్పీవి.భీమారావు, జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, దాసిరాజు, డీఎస్పీలు ఆర్.జయసూర్య, శ్రీవేద, డీఈవో నారాయణ, జిల్లా టూరిజం అధికారి అప్పారావు, అంతర్జాతీయ యోగా టీచరు టి.శిరీష, డీఎన్ఆర్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంటు గాదిరాజు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న అధికారులు, విద్యార్థులు




అబ్బుర పరిచే యోగా విన్యాసాలు






ఆసనాలు వేసిన కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్ కుమార్, ఎస్పీ నయీం అస్మి

యోగా నిరంతర ప్రక్రియ కావాలి : ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం యాగర్లపల్లి వద్ద ఉన్న కొత్తఫ్లైవర్ బ్రిడ్జిపై గురువారం ఉదయం యోగా కార్యక్రమం నిర్వహించారు. బ్రిడ్జిపై గ్రీన్‌కార్పెట్ పరిచి యోగా సాధకులకు ఆహ్వానం పలికారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని ప్రముఖులు, ఉద్యోగులు పాల్గొన్నారు. బొలిశెట్టి మాట్లాడుతూ యోగా సాధనం నిరంతర ప్రక్రియగా ఉండాలన్నారు. మంచి ఆహారాన్ని తీసుకుని వ్యాయామం చేయడం ద్వారా రోగాలను దూరం చేయవచ్చని సూచించారు. 21 రోజులపాటు యోగాపై శిక్షణ ఇచ్చిన యోగా సాధన గురువులను ఎమ్మెల్యే సత్కరించారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమస్థానం సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే సర్టిఫికెట్లు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం కొత్త ఫ్లైఓవర్ బ్రిడ్జిపై యోగాలో ఆసనాలు వేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి, తదితరులు



అధికారులతో మాట్లాడుతున్న పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రతిఒక్కరూ భాగస్వాములవ్వాలి

21 యోగా దినోత్సవం విజయవంతం చేయాలి

అధికారులతో కలెక్టర్లు నాగరాణి, వెట్రిసెల్వి సమీక్ష

భీమవరం టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా 21 న జిల్లా వ్యాప్తంగా నిర్వహించే యోగా కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. యోగ కార్యక్రమాల నిర్వహణపై కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎంపీడీవోలు, తహసీల్దారులు, మునిసిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడు తూ 21న యోగా కార్యక్రమాల నిర్వహణకు మండల ప్రత్యేక అధికారులను నియమించామని సంబంధిత అధికారులు మండలస్థాయి అధికారుల సమన్వయంతో పనిచేసి యోగా కార్యక్రమాలు విజయవంతం చేసేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్టర్ చేసుకున్న ప్రతి ఒక్కరిని యోగా కార్యక్రమంలో పాల్గొనే విధంగా చూడాలన్నారు. సంబంధిత మండలస్థాయి అధికారులను సచివాలయ కేంద్రాలకు పంపించి గుర్తించిన లొకేషన్‌లో 21వ తేదీన ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు తప్పనిసరిగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించి సంబంధిత వీడియో, ఫోటోలను అప్లోడ్ చేయాలన్నారు. జిల్లా కలెక్టరేట్ పెరేడ్ గ్రౌండ్లో 21న నిర్వహించే యోగా ఏర్పాట్లు,విద్యార్థినీ, విద్యార్థులు హాజరుపై సంబంధిత అధికారులు, విద్యాసంస్థల యాజమాన్యాలతో కలెక్టర్ సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, ఆర్డీవో ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా టూరిజం అధికారి ఎ.అప్పారావు, గ్రామ వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

5,445 ప్రాంతాల్లో యోగా : వెట్రిసెల్వి

ఏలూరుసిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 21న అన్ని ప్రాంతాల్లోను అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పెద్దఎత్తున నిర్వహించాలని ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. గురువారం అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు అనుసరించి ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లాలోని అన్ని గ్రామ/వార్డు సచివాలయాలు, గ్రామ, మండల, మున్సిపల్, జిల్లా స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. సీఎం క్యాంపు కార్యాలయం నుంచి గురువారం యోగాంధ్ర కార్యక్రమంపై కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లాలోని 605 సచివాలయాల పరిధిలో 5445 ప్రాంతాల్లో ఈనెల 21వతేదీన ప్రభుత్వం నిర్ధేశించిన యోగా ప్రొటోకాల్‌ను నిర్వహించాలన్నారు. పేర్లు నమోదు చేసుకున్న పౌరులందరూ పాల్గొనేలా చొరవ చూపాలన్నారు. జిల్లాలో ఇంతవరకు 8,53,111 మంది యాప్‌లో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు.

యోగాంధ్రకు 355 ఆర్టీసీ బస్సులు

ఏలూరు జిల్లా నుంచి 170.. పశ్చిమ నుంచి 185

విశాఖకు వెళ్లిన వాహనాలు

ఏలూరు క్రైం/ భీమవరం టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఈనెల 21న విశాఖపట్టణంలో భారీ ఎత్తున నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏలూరు జిల్లా నుంచి 170 బస్సులను పంపిస్తున్నారు. ఏలూరు జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోలు ఉన్నాయి. ఈ మూడు డిపోల నుంచి మొత్తం 170 బస్సులను విశాఖపట్టణానికి గురువారం రాత్రి పంపిస్తున్నారు. ఈ బస్సులను విశాఖపట్టణం జిల్లాలోని గ్రామాలకు కేటాయించి ఆ ప్రాంతాల నుంచి యోగా కార్యక్రమానికి హాజరయ్యే వారి నిమిత్తం వినియోగించనున్నారు. ఈ మేరకు జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారిణి షేక్ షబ్నం ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహిస్తున్నారు. ప్రతి బస్సును డిపోల్లోని మెకానికల్‌ల చేత అన్ని భాగాలను క్షుణ్ణంగా పరిశీలన చేసిన తరువాత పంపిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 185 బస్సులు శుక్రవారం ఉందయం బయలు దేరి వెళ్లనున్నాయి. ప్రధాని నరేంద్రమోదీ పాల్గొనే ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకోవటంతో అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో ఉన్న నాలుగు డిపోల నుంచి ఆర్టీసీ బస్సులతో పాటు, ఆర్టీసి అద్దె బస్సులను పంపిస్తున్నారు. బస్సులు భారీగా తరలి వెళ్ళటంతో శుక్రవారం, శనివారం ప్రయాణాలను వాయిదా వేసుకుంటే మంచిది. తిరిగి ఆదివారం నుంచి సర్వీసుల యథావిధిగా నడుస్తాయి.



ఎన్నికలా..? నామినేటెడ్ పదవులా..?

సహకార సంఘాలపై ఆశావహుల ఎదురుచూపు

గత ప్రభుత్వం త్రిసభ్య కమిటీలతో సరి

కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రత్యేక అధికారుల నియామకం

ఉమ్మడి జిల్లాలో 258 సహకార సంఘాలు

జూలై నెలాఖరు వరకు ప్రత్యేక అధికారుల పాలన

భీమవరం రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి):సహకార సంఘాలకు ఎన్నికలా...? నామినేటెడ్ పదవులా అనేది సంస్థాగతంగానే మిగిలింది. ఇప్పటికే డీసీసీబీ చైర్మన్ నామినేటెడ్ అయిపోవడం సహకార సంఘాల పాలకవర్గాల ఏర్పాటుపై ఆశావహులు ఎదురు చూపులు మొదలయ్యాయి. ఉమ్మడి జిల్లాలో 258 సహకార సంఘాలు ఉన్నాయి. ఒక్కో సహకార సంఘానికి చైర్మన్‌తో కలిపి పాలకవర్గానికి 13 మంది సభ్యులుగా ఏర్పడతారు. దీనిని బట్టి 3,354 మందికి పాలకవర్గంలో సభ్యులుగా ఏర్పడే అవకాశం ఉంది. దీంతో సంఘాల ఎన్నికలపైనే అంచనాలు వేసుకుంటున్నారు.

ఆరేళ్లుగా ఎన్నికలు లేవు

సహకార సంఘాలకు దాదాపు ఆరేళ్లుగా ఎన్నికలు లేవు. 2019 ముందు నుంచి పాలకవర్గాలు ముగిశాయి. గత ప్రభుత్వం 2019 నుంచి త్రిసభ్య కమిటీల పేరుతో ముగ్గురు సభ్యులతో నామినేటెడ్ పదవులతో సరిపెట్టుకుంటూ వచ్చింది. ఐదేళ్లు అదే విధానం కొనసాగించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రత్యేక అధికారుల పాలన ఆరునెలలుగా నిర్ణయించారు. మరలా ఆరు నెలలు పొడిగించారు. జూలై నెలతో ప్రత్యేక అధికారుల గడువు ముగుస్తుంది. ఈ లోపు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మధ్యలో నామినేటెడ్ పదువులు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రజాప్రతినిధుల నుంచి మాటలు వినిపించినా అమలు కాలేదు. అయితే ఈసారి ఏ నిర్ణయం ఉంటుందో ప్రశ్నార్థకంగానే ఉంది.

సహకార సంఘాల అభివృద్ధికి అడుగులు

సహకార సంఘాలను మరింత బలపేతం చేసేలా అడుగులు వేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా కంప్యూటరీకరణ చేయాలంటూ వాయిదా పడుతూ వస్తున్న దానిని ఈ సంవత్సరంలో కంప్యూటరీకరణ దాదాపు పూర్తి చేసేశారు. రుణాల సంఖ్య పెంచారు. ఉమ్మడి జిల్లాలోని 258 సహకార సంఘాలలో 3 లక్షల మంది రైతుల వరకు కిసాన్ క్రెడిట్ కార్డుల రుణాలు పొందారు. మరిన్ని సౌకర్యాలు రైతులకు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

సొసైటీల్లో కామన్ సేవలు

ఉచితంగా 25 రకాలు సేవలు

158 పీఏసీఎస్‌లలో ప్రజలకు, రైతులకు మేలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార పరపతి సంఘాల్లో ఆన్‌లైన్ సేవలు విస్తృతంగా అందించడానికి అడుగులు పడ్డాయి. దశాబ్దాలుగా నెరవేరని కంప్యూటరీకరణ కార్యక్రమాన్ని అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఏడెనిమిది నెలల్లో రూ.కోట్లు వెచ్చించి పూర్తిచేసింది. మీ సేవ కేంద్రాల్లో అందిస్తున్నట్టు ఇక్కడ సేవలను రైతులకు అన్ని విధాలుగా అందు బాటులోకి తేవడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సొసైటీల లావాదేవీలను పారదర్శకంగా జరిపేందుకు ఏలూరు జిల్లాలో రూ.12 కోట్లతో 158 సొసైటీల కంప్యూటరీకరణ ఇటీవల పూర్తయింది. దీంతో సొసైటీలు అన్నీ ఆన్‌లైన్ సేవలకు సర్వం సిద్ధంగానే ఉన్నాయి. ప్రధానంగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో ఏర్పాటు చేసిన సీఎస్‌సీ(కామన్ సర్వీసు సెంటర్) కింద రైతులకు ఉచితంగా విస్తృత సేవలందించాలని సహకార శాఖ ఉన్నతాధికారులు కంప్యూటీకరణ సందర్భంలోనే దిశానిర్దేశం చేశారు. ఈ సేవలకు నామమాత్రపు రుసుం తీసుకోవాలన్న నిబంధన ఉన్నా ప్రస్తుతం ఉచితంగా అందిస్తు న్నారు. బస్సు, రైలు టిక్కెట్లు, విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు. ఫోన్, డీటీహెచ్ రీఛార్జులు పల్లెల్లోను అతి సునాయాసంగా చేసుకోవచ్చు. సేవలను పూర్తిగా వినియోగించుకోవడంపైన పీఏసీఎస్‌ల సెక్రటరీలు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. గ్రామాల్లో పాన్‌కార్డు కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ పాన్‌కార్డు పొందడానికి ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. పాన్‌కార్డు సర్వీసుతోపాటు కరెంటు బిల్లు చెల్లింపు, సెల్‌ఫోన్, డీటీహెచ్ రీచార్జి, బీమా రెన్యువల్, న్యూ ఇన్సూరెన్స్ చెల్లింపు, ఐఆర్‌సీటీసీ (రైలు టిక్కెట్ బుకింగ్), విమాన,బస్సు టికెట్ల కొనుగోలు, ఎరువులు, విత్తనాలు, ఆర్గానిక్ ప్రొడక్టు తదితర 25 రకాలు సేవలను అందిస్తున్నారు.

మావుళ్లమ్మకు జ్యేష్టమాస జాతర

భీమవరం టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి):ఆధ్యాత్మిక భావన ప్రతి ఒక్కరిలో ఉండాలని, దైవారాధన మించిన భక్తి మరొకటి లేదని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. నీరుల్లికూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ, దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం మావుళ్ళమ్మ జ్యేష్టమాస జాతర ఆయన పూజలు చేసి ప్రారంభించారు. ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జున శర్మ ప్రత్యేక పూజలఎ అనంతరం హారతులిచ్చారు. జాతర నిమిత్తం దేవస్థానం నుంచి ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ నుంచి రూ 2 లక్షల 25 వేలను ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా నీరుల్లి కూరగాయల పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటి సభ్యులకు అందించారు. రామాయణం గోవిందరావు, కొప్పుల సత్యనారాయణ,(సత్తిబాబు,), రామాయణం చిన్నారి, సత్యనారాయణ, కొప్పుల రంగరావు, మానే బాస్కరరావు, యర్రంశెట్టి శ్రీనివాసరావు, మానే తేజ, కొండ, వబిలిశెట్టి రామకృష్ణ, పడమటి రామకృష్ణ, పాల్గొన్నారు. జాతర సందర్బంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.




నగరోత్సవానికి సిద్ధం చేసిన హంస వాహనం..మావుళ్ళమ్మ ఉత్సవమూర్తికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు




ఊరేగింపులో ఆకర్షణీయంగా డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు



సిద్ధాంతం మావుళ్ళమ్మ జాతర

పెనుగొండ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సిద్ధాంతం గ్రామదేవత మావుళ్ళమ్మ జాతర ప్రారంభమైంది. అమ్మవారిని నిలబెట్టి గ్రామంలో గరగాలమ్మ, సోమాలమ్మ, పోతురాజు స్వామి వార్లకు చలివిడి, పానకాలు సమర్పించి గ్రామంలో ఉత్స వాలను ప్రారంబించారు. ఈ నెల 24న మంగళవారం రాత్రి మావుళ్ళమ్మ అమ్మవారికి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, శక్తివేషాలతో జాతర మహోత్సవం, 25, 26, 27 తేదీలలో తీర్థం, 29న భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

సత్యవోలులో మావోయిస్టు సుధాకర్‌కు నివాళి


సభలో మాట్లాడుతున్న నిర్బంధ వ్యతిరేక కమిటీ నాయకులు రవిచంద్ర

పెదపాడు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి దివంగత మావోయిస్టు అగ్రనేత తెంటు సుధాకర్ చేసిన పోరాటం శాశ్వతంగా నిలిచిపోతుందని నిర్బంధ వ్యతిరేక పోరాట వ్యతిరేక కమిటీ నాయకులు రవిచంద్ర అన్నారు. సత్యవోలులోని సుధాకర్ ఇంటి వద్ద అరుణోదయ కళాకారిణి విమలక్క అధ్యక్షతన సంస్మరణ సభ గురువారం జరిగింది. దేశభక్త ప్రజాతంత్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ పేరుతో ఉద్యమాలను, ఉద్యమకారులను అణచివేస్తోందని, ఈ విధానం తక్షణం నిలిపివేసి శాంతి చర్చలు నిర్వహించాలన్నారు. ఆయుర్వేద విద్యార్థిగా ఉన్న సుధాకర్ విప్లవ భావజాలంతో మావోయిస్టుగా మారి చేసిన పోరాటాన్ని స్మరించుకుంటూ నివాళులర్పించారు. భవానీ(ఏబీఎంఎస్), విప్లవ రచయిత పాణి, ప్రగతిశీల నాయకులు కొండారెడ్డి (ఏకేఎస్), సానుభూతిపరులు, స్నేహితులు పాల్గొన్నారు.

సెల్ సిగ్నల్ ఆధారంగా బ్యాగ్ లభ్యం..వస్తువులు భద్రం


గుర్తించిన బ్యాగు

ఆకివీడు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఓ దొంగ ట్రైన్‌లో దొంగిలించి బయట పడేసిన బ్యాగును సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఆకివీడు పోలీసులు చెరుకువాడ సమీపంలో స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి సంధ్య అనే మహిళ విజయనగరం పుట్టింటికి వెళ్ళేందుకు విశాఖ ఎక్స్‌ప్రెస్ మంగళవారం రాత్రి ఎక్కింది. ఆకివీడు రైల్వే స్టేషన్ దాటే సరికి ట్రైన్‌లో అనుమానంగా సంచరిస్తున్న వ్యక్తిని దొంగ అని గుర్తించి నిలదీశారు. దీంతో అతను దొంగిలించిన సంధ్య బ్యాగును చెరుకువాడ సమీపంలో బయటకు విసిరేశారు. ఆ బ్యాగ్‌లో సెల్‌తో పాటు బంగారం వస్తువులు ఉన్నాయి. ఈ అలజడికి నిద్రలేచిన సంధ్య తన బ్యాగు లేదని గుర్తించి హైదరాబాద్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న భర్త రాథోడ్ సురేశ్‌కు ఫోన్ చేసి చెప్పింది. సురేశ్ ఆకివీడు ఎస్‌ఐ హనుమంతు నాగరాజుకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. వెంటనే అలర్ట్ అయిన ఎస్‌ఐ తన పోలీస్ స్టేషన్‌లోని కానిస్టేబుల్ శివ, ఐడీ పోలీస్ విజయను చెరుకువాడ పంపించి సెల్‌ఫోన్ సిగ్నల్ ద్వారా ఆరా తీశారు. రెండు గంటల అనంతరం తుప్పల్లో బ్యాగ్ దొరకడంతో రాథోడ్ సురేశ్‌కు సమాచారం అందించగా గురువారం వచ్చి కృతజ్ఞతలు తెలిపి బ్యాగ్‌ను తీసుకెళ్లారు. పట్టుకున్న దొంగను రాజమండ్రి రైల్వే పోలీసులకు అప్పగించినట్టు పోలీసులు తెలిపారు.

నేడు ఏలూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఏలూరు క్రైం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఏలూరుబార్ అసోసియేషన్ కార్యవర్గానికి శుక్రవారం ఎన్నికలు జరగనున్నాయి. అసోసియేషన్‌లో 787 మంది న్యాయవాదులు సభ్యత్వం కలిగి ఉన్నారు. ఏడాది పాటు ఉండే పదవికి ఈ సారి పోటీలో నువ్వానేనా అనే రీతిలో ఢీ కొంటున్నారు. సాధారణంగా గతంలో ఏకగ్రీవంగా జరిపేవారు. మరికొన్ని సమయాల్లో కొన్ని పదవులకు మాత్రమే పోటీ నిర్వహించేవారు. ఈసారి నామినేషన్ వేసిన ప్రతి ఒక్కరూ పోటీలో ఉన్నారు. ఎవరూ తమ నామినేషన్‌ను ఉపసంహరించలేదు. దీంతో అధ్యక్ష పదవికి అబ్బినేని విజయ్‌కుమార్, కోనే సీతారామారావు, వానపల్లి అప్పారావు పోటీ పడుతున్నారు. ఉపాధ్యక్ష పదవికి మాంద్రు రాజేంద్ర, ఎస్.కృష్ణారావులు పోటీ పడుతున్నారు. ప్రధాన కార్యదర్శి పదవికి ముగ్గురు, జాయింట్ సెక్రటరీ పదవికి ఇద్దరు, లైబ్రేరియన్ సెక్రటరీకి ఇద్దరు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ పదవికి ఇద్దరు, ట్రెజరర్ పదవికి ఇద్దరు, లేడీ రిప్రజెంటేటివ్ పదవికి ఇద్దరు పోటీ పడుతున్నారు. ఎన్నికలు శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి 4.30 గంటల వరకూ జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న ఏలూరు బార్ అసోసియేషన్ భవనంలో నిర్వహించనున్నారు. ఇప్పటికే కోర్టు లోపల, బయట పోటీలో ఉన్న అభ్యర్థుల ఫ్లెక్సీలతో నిండిపోయి కళకళలాడుతుంది. ఓటింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం కౌంటింగ్‌ను నిర్వహించనున్నారు.

ఐటీఐలో రెండో విడత అడ్మిషన్లకు అవకాశం

ఉండి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2025-26 సంవత్సర విద్యా సంవత్సరంలో రెండో విడత ప్రవేశానికి మిగిలిన సీట్లలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఉండి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ వేగేశ్న శ్రీనివాసరాజు కోరారు. అభ్యర్థులు జూలై 15న సాయంత్రం 5గంటలలోపు ఆన్‌లైన్ చేయించుకుని తప్పనిసరిగా ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో వెరిఫికేషన్ చేయించుకుని తమ రశీదును పొందాలని సూచించారు. కౌన్సెలింగ్ సమయంలో ఈ రశీదు తప్పనిసరిగా చూపించాలని ప్రిన్సిపాల్ తెలిపారు. వెరిఫికేషన్ చేయించుకుని అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు అనర్హులన్నారు. దరఖాస్తులు చేసుకునేందుకు జూలై 15వ తేదీ సాయంత్రం 5గంటల వరకు సమయం ఉందన్నారు. టెన్త్‌లో పాస్, ఫెయిల్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు ఉండి ప్రభుత్వ ఐటీఐ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. టెన్త్ ఫెయిల్ అయిన విద్యార్థులకు వెల్డర్-1 ఇయర్ ట్రేడ్‌లో అవకాశం ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు.

స్వల్పంగా పెరిగిన గోదావరి నీటిమట్టం

పోలవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పోలవరంలో గోదావరి నీటిమట్టం గురువారం నాటికి స్వల్పంగా పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉప నదులు, కొండవాగుల జలాలు గోదావరిలో కలుస్తుండటంతో నీటిమట్టం పెరిగింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్వేలో 48 గేట్లు, స్పిల్వే దిగువన ఉన్న 6 స్లూయిజ్ గేట్ల నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ఈఈ శ్రీనివాస్ మాట్లాడుతూ అదనంగా గోదావరిలోకి వస్తున్న జలాలను స్పిల్వే నుంచి 22,947 క్యూసెక్కులను దిగువకు విడుదల చేసినట్టు తెలిపారు. పోలవరం ప్రాజెక్టులో ఎగువ కాఫర్ డ్యాంకి ఎగువన 25.970 మీటర్లు, దిగువ కాఫర్ డ్యాంకి దిగువన 14.100 మీటర్లు, స్పిల్వే ఎగువన 25.950 మీటర్లు, స్పిల్వే దిగువన 16.080మీటర్లు నీటిమట్టం నమోదైందన్నారు. పోలవరం నుంచి గూటాల వరకు గోదావరి నీటిమట్టం పెరిగి ఇసుక తిన్నెల మీదుగా నీరు ప్రవహిస్తోంది.

రవాణా శాఖలో ఏడు పోస్టులు ఖాళీ

ఏలూరు క్రైం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రవాణాశాఖకు సంబంధించి ఏలూరులో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కార్యాలయం, రీజనల్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ కార్యాలయం, నూజివీడులో రవాణా శాఖ కార్యాలయం, జంగారెడ్డిగూడెంలో రీజినల్ ట్రాన్స్ పోర్టు కార్యాలయం ఉన్నాయి. డీటీసీ ఒకరు ఏలూరులో ఆర్టీవో ఒకరు, జంగారెడ్డిగూడెంలో ఆర్టీవో ఉన్నారు. ఏలూరులో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు నలుగురు, జంగారెడ్డిగూడెంలో ఒకరు, నూజివీడులో ఒకరు ఉన్నారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు జంగారెడ్డిగూడెంలో ఇద్దరు, నూజివీడులో ఇద్దరు, ఏలూరులో 11 మంది ఉన్నారు. హెడ్‌కానిస్టేబుళ్లు ఇద్దరు ఉండాల్సి ఉండగా ఒకరు మాత్రమే ఉన్నారు. ఇటీవలె ఒక హెడ్‌కానిస్టేబుల్ పదవి విరమణ చేయడంతో ఆపోస్టు ఖాళీగా ఉంది. జిల్లాలోని రవాణా శాఖ కార్యాలయంలో అటెండర్ పోస్టులు ఐదు పోస్టులు ఐదు ఉండగా అన్ని ఖాళీగానే ఉన్నాయి. జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఏడు ఉండగా ఏడుగురు ఉన్నారు. సీనియర్ అసిస్టెంట్ పోస్టులు 10 ఉండగా ఏలూరులో ఒక్క పోస్టు మాత్రమే ఖాళీగా ఉంది. రవాణాశాఖకు డిప్యూటేషన్‌పై హోంగార్డులను హోంగార్డు యూనిట్ నుంచి తీసుకుని వారి సేవలను వినియోగించుకుంటున్నారు.

30 నుంచి ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

నూజివీడు టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నూజివీడులోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్‌కు సంబంధించి 4,400 సీట్ల భర్తీకి గాను కౌన్సెలింగ్ ప్రక్రియ 30 నుంచి జూలై 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, అడ్మిషన్స్ కన్వీనర్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలోని ఆర్కే వ్యాలీ మినహా మిగిలిన మూడు క్యాంపస్‌లకు నూజివీడు కేంద్రంగా కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. ఎంపిక చేసిన విద్యార్థుల వివరాలను ఈనెల 23వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు వెబ్‌సైట్లో ఉంచడంతో పాటు, విద్యార్థులకు నేరుగా మెసేజ్‌లను పంపిస్తామన్నారు. నూజివీడు, ఆర్కే వ్యాలీలో ఈ నెల 30న, జూలై ఒకటో తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తుండగా శ్రీకాకుళం క్యాంపస్‌కు సంబంధించి జూలై 2,3వ తేదీల్లో, ఒంగోలు క్యాంపస్‌కు జూలై 4,5 తేదీల్లో నూజివీడు క్యాంపస్‌లో, కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులు జూలై 14వ తేదీ సంబంధిత క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.

ఎంటీఎస్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ వాయిదా

ఏలూరు అర్బన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలో పనిచేస్తున్న ఎంటీఎస్(మినిమం టైం స్కేల్)ఉపాధ్యాయులకు శుక్రవారం జరగాల్సిన బదిలీలను అధికారులు వాయిదా వేశారు. మళ్లీ కౌన్సెలింగ్ నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని జిల్లా విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

మృత్యు ద్వారం


గోదావరి, సముద్రం కలిసే ప్రదేశం

సముద్రం, గోదావరి కలిసే ముఖద్వారం వద్ద ప్రమాదాలు

మూడు రోజుల క్రితం కెరటం తాకి పడవ బోల్తా.. ఇద్దరు మృతి

గతంలో బియ్యపుతిప్ప మత్స్యకారుడు గల్లంతు

ఇసుక మేటలకు ముక్కలైన నరసాపురం బోటు

భయం గుప్పెట్లో మత్స్యకారులు

నరసాపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గోదావరి సముద్రం కలిసే ముఖ ద్వారం ప్రమాదాలకు అడ్డాగా మారింది. రెండు రోజుల క్రితం అంతర్వేది నుంచి వేటకు వెళ్లిన బోటు ఒకటి ఈ ముఖద్వారం వద్ద ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో కృష్ణా జిల్లా నాగాయలంక మండలానికి చెందిన నాగిడి రాము (25), సంగమేశ్వరానికి చెందిన తమ్ము పోతురాజు (59) మృత్యువాత పడ్డారు. రెండేళ్ల క్రితం నరసాపురం మండలం బియ్యపుతిప్ప గ్రామానికి చెందిన ఒడుగు నాగరాజు, ఏడుకొండలు, లక్ష్మణరావు, కొండలరావులు వేటకు వెళ్లారు. తిరిగి వస్తుండగా ముఖద్వారం వద్ద వీరు వస్తున్న పడవపై కెరటం ఎగసిపడింది. ఊహించని ఈ ప్రమాదంలో బోటు బోల్తాపడి నలుగురు చెల్లా చెదురయ్యారు. ఒడుగు నాగరాజు కొట్టుకుపోగా మిగిలిన ముగ్గురు ప్రాణాలతో బయటపడ్డారు. ఇప్పటికీ నాగరాజు మృతదేహం చిక్కలేదు, అంతకు ముందు నరసాపురం పట్టణానికి చెందిన పీతల ప్రసాద్ వేటకు వెళ్లి తిరిగి వస్తుండగా ముఖద్వారం వద్ద ప్రమాదానికి గురైంది. బోటు ధ్వంసం కావడంతో అందులోని మత్స్యకారులు ప్రాణాలతో బయటపడ్డారు. ఇలా వరుసగా ప్రమాదాలు జరుగుతుండటంతో వేటకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు ముఖద్వారం చేరగానే మత్స్యకారులు భయం గుప్పెట్లోకి వెళ్లిపోతున్నారు. అది దాటగానే హమ్మయ్యా.. బ్రతికాం.. అంటూ ఊపిరి పీల్చుకుంటున్నారు. సీజన్‌లో నరసాపురం, అంతర్వేది నుంచి రోజుకు 100 నుంచి 200 బోట్లు వేట సాగిస్తుంటాయి. ఇవన్నీ ఈ ముఖద్వారం గుండానే వెళ్లతాయి. సాధారంగా గోదావరి, సముద్రం ప్రదేశం కావడంతో ఇక్కడ మత్స్య సంపద పుష్కలంగా దొరుకుతుంది. ఈ కారణంగా ఈ ప్రాంతంలో వేట సాగించేందుకు వందలాది బోట్లు వస్తుంటాయి. నరసాపురం, అంతర్వేది ప్రాంతాలను ల్యాండింగ్ సెంటర్‌గా చేసుకుని ఎగుమతులు, దిగుమతులు చేసుకోవడం పరిపాటిగా మారింది. తిరిగి గోదావరి గుండానే సముద్రంలోకి వెళ్లతుంటారు.

ఇసుక మేటల వల్లే ప్రమాదాలు



సముద్రం, గోదావరి కలిసే ముఖద్వారం ప్రదేశానికి కొంత దూరంలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి కారణం ఇసుక మేటలే.. పాటు పోటు సమయాల్లో మేటలు పేరుకు పోతున్నాయి. వీటిని గుర్తించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో తరుచూ డ్రెడ్జింగ్ చేయాలి. అప్పుడే కొంత మేర ప్రమాదాలు తగ్గుతాయి. తీరంలో కూడా సముద్ర కోత తగ్గుతుంది.

-వనమాడి రాంబాబు, బోటు యజమాని

ఇక్కడ.. అలల ఉధృతి ఎక్కువ

సముద్రంలో గోదావరి కలిసే ప్రదేశం కావడంతో అక్కడ అలలు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో ముఖద్వారం వద్ద అలలు ఎగసిపడుతుంటాయి. గోదావరిలో నీరులేని పక్షంలో ఈ ప్రాంతంలో ఇసుక మేటలు దర్శనమిస్తాయి. తెల్లవారుజాము, రాత్రి సమయాల్లో మత్స్యకారులు తిరిగి వచ్చే సమయాల్లో ఇవి కనిపించకపోవడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. అదే సమయంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటం వల్ల కొన్ని సమయాల్లో బోట్లు తిరగబడుతున్నాయని మత్స్యకారులు వాపోతున్నారు.

నిత్యం ఇక్కడ..ఇదే సీన్

పశువుల సంచారంతో ట్రాఫిక్ జామ్

పట్టించుకోని అధికారులు


ఏలూరు శనివారపుపేట లో-బ్రిడ్జిలో వెళ్తున్న పశువులు.. స్తంభించిన ట్రాఫిక్

ఏలూరు క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరం రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది. నగరంలో నివాసాలకు గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతి ఏడాది పెరుగుతూనే ఉన్నారు. నిత్యం నగరానికి వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తూనే ఉంటాయి. నగరంలో ఒక వైపు పశువులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూనే ఉన్నాయి. రాత్రి వేళ ఎక్కడ పడుకుంటాయో, ఏ రోడ్లపై అడ్డంగా ఉంటాయో ఎవరికీ తెలియదు. గతంలో ఇలాంటి పశువులను కట్టడి చేయడానికి బందెలదొడ్డి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా జైలు సమీపంలోని వాటర్ ట్యాంక్ కింద ఉండేది. క్రమేపీ దీని నిర్వహణ నిలిచిపోయింది. ఇలాంటి పశువులు రోడ్లపైనే ఉన్నాయి. ఈ పశువుల మాట ఎలా ఉన్నా నిత్యం ఉదయం, సాయంత్రం పాడిగేదెలను ఓ రైతు తమ్మిలేరు కాలువ వద్ద మేతకు అడ్డాగా మార్చుకున్నాడు. ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల మధ్యలో ఆపశువులను శనివారపుపేట నుంచి వస్తూ తమ్మిలేరు లోబ్రిడ్జి దాటిన తరువాత తమ్మిలేరులోకి అవి మేతకు వెళ్లిపోతాయి. ఇవి తిరిగి సాయంత్రం 4 గంటలు 4.30 గంటల మధ్య తమ్మిలేరు నుంచి అమీనాపేట వైపు ఉన్న లోబ్రిడ్జి నుంచి శని వారపుపేట వైపు తాయితీగా వెళ్తాయి. ఒకటి కాదు, రెండు కాదు సుమారు 50కి పైగా ఈ పశువులు వెళ్ళడంతో ఆ సమయంలో కాలేజీలు, పాఠశాలలు విడిచిపెట్టడం వల్ల విద్యార్థులు, వాహన దారులు ట్రాఫిక్ ఇబ్బందులతో నరకయాతన చూస్తున్నారు. ఉదయం పూట కూడా కాలేజీలు, పాఠశాలకు వెళ్ళే సమయంలోనే ఈ పాడిగేదెలు మేతకు వెళ్తున్నాయి. ఆ సమయంలో కూడా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వాటి వెనుక ఏనాడు కూడా పశువుల కాపరికాని, రైతు కాని కనిపించరు. విద్యార్థులు, వాహన దారులు, ప్రజలు నిత్యం ఆ దారిలో నరకయా తనకు గురికావాల్సిందే. అధికారులు తక్షణం గేదెల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సారా తయారీని విడిచి పెట్టిన వారికి ప్రత్యేక ఉపాధి

ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి


సారా తయారీని విడిచిపెట్టిన వారికి రుణాల పంపిణీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ , జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరుసిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీని విడిచిపెట్టిన తయారీదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్‌లో సారా నిర్మూలనపై ప్రత్యామ్నాయ ఉపాధి కార్యక్రమం కింద డిఆర్‌డిఏ ద్వారా అర్హులైన 40 మంది లబ్దిదారులకు రూ. 31.40 లక్షల రుణాలను అందజేశారు. అనంతరం సారా రహిత జిల్లాగా ఏలూరును నిలుపుతామని , నాటు సారా జోలికి వెళ్ళబోమని ప్రతిజ్ఞా కార్యక్రమం కూడా నిర్వహించారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ నాటుసారా జోలికి వెళ్ళకుండా మంచి మార్గాన్ని ఎంచుకోవాలని వారికి సూచించారు. నవోదయం 2.0 కార్యక్రమం కింద ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాటు సారా విడిచిన కుటుంబాలను ఆదుకునేందుకు వివిధ సంక్షేమ శాఖల ద్వారా సర్వే నిర్వహించి వారికి అవసరమైన ఉపాధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రుణాలు పొంది తిరిగి నాటుసారా జోలికి వెళితే కఠినమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ సారా ఆరోగ్యానికి , సమాజానికి హానికరమన్నారు. సారా జోలికి వెళ్ళకుండా ప్రభుత్వం అందిస్తున్న సహాయంతో సమాజంలో గౌరవ ప్రదంగా జీవించేందుకు చక్కటి బాటలు వేసుకోవాలన్నారు. పాల వ్యాపారమే కాకుండా చాలా వ్యాపారాలు ఉన్నాయని వాటిద్వారా జీవనోపాధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి కమిషనర్ బి.శ్రీలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

వేర్వేరుచోట్ల నలుగురి మృతి

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో వేర్వేరుచోట్ల గురువారం మొత్తం నలుగురు మృతి చెందారు. పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధాంతం గ్రామానికి చెందిన మహిళ యాసిడ్ తాగి మృతి చెందారు. బాదంపూడి- చేబ్రోలు మధ్య రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి, పాలకోడేరులో పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒకరు.. ఏలూరు జిల్లా పెదవేగి మండలంలో ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు.

యాసిడ్ తాగి మహిళ మృతి

పెనుగొండ, జూన్19(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా బాధను భరించలేక యాసిడ్‌తాగి మహిళ మృతి చెందినట్టు ఎస్‌ఐ గంగాధరరావు తెలిపారు. సిద్ధాంతం గ్రామానికి చెందిన జనిపిరెడ్డి నాగమణి(55) అనారోగ్యం కారణంగా ఈనెల 18వ తేదీ రాత్రి బాధను భరించలేక ఇంటిలో ఉన్న బాత్‌రూమ్ క్లీన్ చేసే యాసిడ్ తాగినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఆమెను తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందినట్టు తెలిపారు. నాగమణి చిన్న కుమార్తె చిలక కాంచనదుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఏలూరు జిల్లా బాదంపూడి, పశ్చిమ గోదావరి జిల్లా చేబ్రోలు రైల్వేస్టేషన్‌ల మధ్య గురువారం జరిగింది. జీఆర్‌పీ ఎస్‌ఐ పి.అప్పారావు తెలిపిన వివరాలివి.. బాదంపూడి, చేబ్రోలు స్టేషన్ మధ్య గురువారం ఉదయం సమయంలో 50 ఏళ్ల వయస్సుగల వ్యక్తి మృతి చెందినట్టు వివరించారు. మృతుడిని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి మార్చురీ వద్ద భద్రపరిచామన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని కోరారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

పాలకోడేరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కడుపు నొప్పి తాళలేక పురుగుల మందు తాగిన పాలకోడేరు గ్రామానికి చెందిన వ్యక్తి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పాలకోడేరు పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన మామిడిశెట్టి శ్రీను(49) ఈనెల 17వ తేదీన కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని భీమవరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తూ ఉన్నారు. గురువారం తెల్లవారుజామున అతడు మృతి చెందాడు. అతడి కుమారుడు సూర్యచంద్రప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ వెంకటేశ్వరరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెదవేగి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుకనుంచి మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో ముందు బైక్‌పై కూర్చున్న వ్యక్తి మృతి చెందిన ఘటన పెదవేగి మండలంలో జరిగింది. పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలివి.. కూచింపూడి గ్రామానికి చెందిన రామానుజం లక్ష్మణరావు(42) బుధవారం రాత్రి సోదరుడితో కలిసి బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మణరావు తీవ్రంగా గాయపడగా వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనిపై మృతుడి భార్య దుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మానవత్వం మంట కలిసిన వేళ..

ఆస్తి అడిగినందుకు తమ్ముడిపై సోదరుల దాడి

రోడ్డుపై పడవేసి విచక్షణా రహితంగా కర్రలతో దాడి

ఏడుగురిపై కేసు.. వివాదంలో రాజకీయ పార్టీల ప్రమేయం లేదు : సీఐ దుర్గాప్రసాద్


రోడ్డుపై తమ్ముడిపై దాడి చేస్తున్న అన్నదమ్ములు

మొగల్తూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి) : ఆస్తి కోసం మానవత్వం రక్తసంబంధాన్ని కూడా మరిచి తోడపుట్టిన సోదరుడుని నడి రోడ్డుమీదకు ఈడ్చి కర్రలతో చితకబాదిన ఘటన సోషల్ మీడియాలో వీడియో వైరల్ కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. బుధవారం మొగల్తూరు మండలం కాళీపట్నం పడమర గ్రామంలో జరిగిన ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్థానిక అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఐ దుర్గాప్రసాద్ గురువారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన కవురు మణిబాబు, అతడి భార్య కృష్ణవేణిపై దాడికి పాల్పడ్డ అతడి సోదరులు, వారి కుమా రులు కవురు శ్రీను, రామకృష్ణ, శివన్నారాయణ, రంగ, పండు, భాస్కరరావు, మురళీ మొత్తం ఏడుగురిపై కేసు నమోదు చేశారు. గురువారం వీరిని మొగల్తూరు ఎస్‌ఐ జి.వాసు నరసాపురం కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు తెలిపారు.

వివాదం ఇలా..

కాళీపట్నం పడమర గ్రామానికి చెందిన కాశీకేశ్వరరావుకు ఐదుగురు కుమారులు వీరిలో చిన్నకుమారుడైన కవురు మణిబాబుకు పది సెంట్లు స్థలాన్ని ఇచ్చారు. ఇప్పటికే ఐదు సెంట్లు స్థలం కవురు మణిబాబు ఆధీనంలో ఉంది. మిగిలిన ఐదు సెంట్లు స్థలాన్ని ఇవ్వాలని అన్నదమ్ముల్ని అడిగినప్పుడల్లా వారు దాడికి పాల్పడుతూ వస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం కవురు మణిబాబు తనకు రావాల్సిన ఐదు సెంట్ల స్థలాన్ని అప్పగించాలని అన్నదమ్ములను నిలదీశాడు. ఈమేరకు సోదరులు, వారి కుమారులు మణిబాబును రోడ్డుపైకి లాగి కర్రలతో విచక్షణా రహితంగా చితకబాదారు. అడ్డువెళ్లిన భార్య కృష్ణవేణి, కుమార్తెపై కూడా దాడి చేశారు. అడ్డుకునేందుకు స్థానికులు ప్రయత్నించగా వారిని కూడా కొట్టే ప్రయత్నం చేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ మణిబాబు అతని భార్యను స్థానికులు 108 వాహనంలో నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు మొగల్తూరు ఎస్‌ఐ జి.వాసు స్పందించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

బాలికపై అత్యాచారం.. కేసు నమోదు

గణపవరం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఆడుతూ, పాడుతున్న తొమ్మిదేళ్ల బాలికను 49 ఏళ్ల కామాంధుడు అత్యాచారం చేసిన ఘటన గణపవరం మండలం కేశవరంలో గురువారం సాయంత్రం జరిగింది. గణపవరం ఇన్‌చార్జి ఎస్‌ఐ ఎం.సూర్యభగవాన్ తెలిపిన వివరాలివి.. గణపవరంలో మండలంలో ఓ గ్రామానికి చెందిన చిన్నారి గురువారం సాయంత్రం సమయంలో ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన రెడ్డి జయరాజు మాయమాటలు చెప్పి బాలికను అతడి ఇంటికి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడని ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ తెలిపారు. నిందితుడు జయరాజు కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ఈ అత్యాచారానికి పాల్పడ్డాడన్నారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసి దరాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫోన్ మాట్లాడుతుందని మందలించినందుకు..

ఇంటి నుంచి వెళ్లిపోయిన యువతి

కౌన్సెలింగ్ అనంతరం తల్లిదండ్రులకు అప్పగింత

30 నిమిషాల్లోనే ఆచూకీ తెలుసుకున్న పోలీసులు


యువతికి కౌన్సెలింగ్ ఇస్తున్న త్రీటౌన్ పోలీసులు

ఏలూరు క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఫోన్ ఎక్కువగా మాట్లాడుతున్నావని కుమార్తెను తల్లి మందలించడంతో కోపంతో అలిగి స్కూటీ వేసుకుని వెళ్లిపోయింది. ఆ యువతి కోసం ఎంత వెతికినా ఆచూకీ కానరాలేదు. చివరకు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేవలం 30 నిమషాల వ్యవధిలోనే ఆ యువతి ఆచూకీ తెలుసుకుని తీసుకువచ్చి కౌన్సెలింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఏలూరు విద్యానగర్‌కు చెందిన సేనపు వెంకట సత్యవాణి తన కుమార్తె ఇంట్లో ఎక్కువగా ఫోన్‌లు మాట్లాడుతూ ఉండడంతో మందలించింది. ఈమేరకు కోపంతో ఈనెల 18వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఇంటి వద్ద నుంచి స్కూటీ వేసుకుని వెళ్లిపోయింది. రాత్రి 9 గంటల వరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఏలూరు త్రీటౌన్ పోలీసులకు తల్లి ఫిర్యాదు చేశారు. త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు వెంటనే స్పందించి ఆ యువతి మొబైల్ ఫోన్ లోకేషన్ గుర్తించగా ఏలూరు రామచంద్రరావపేటలో ఉన్నట్టు తెలుసుకుని అక్కడకు వెళ్లి ఆమెను సురక్షితంగా ఏలూరు వన్‌స్టాప్ సఖి సెంటర్‌కు తీసుకువెళ్ళారు. తల్లిదండ్రులను అక్కడకు పిలిపించి ఆ యువతికి, వారికి కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించారు. ఫిర్యాదు చేయగానే వెంటనే స్పందించి తన కుమార్తెను అప్పగించిన త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, వారి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

మగ పిల్లలు పుట్టలేదని..

ఇద్దరు భార్యలను దూరం పెట్టిన ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగికి దేహశుద్ధి

మరో ముగ్గురు మహిళలతో సహజీవనం

కొయ్యలగూడెం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మగ పిల్లలు పుట్ట లేదని ఇద్దరు భార్యలను దూరం పెట్టి మరో ముగ్గురు మహిళలతో సహజీవనం చేస్తున్న ఓ ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగికి ఇద్దరు భార్యలతో సహా బంధువులు దేహశుద్ధి చేసిన ఘటన గురువారం కొయ్యలగూడెంలో జరిగింది. బాధిత మహిళలు తెలిపిన వివరాలివి.. తెలంగాణ రాష్ట్రం కల్లూరు మండలానికి చెందిన శ్రీనివాస్‌కి ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం చిట్యాలకు చెందిన లావణ్యకు 12ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరిద్దరికి ఇద్దరు ఆడ పిల్లలు జన్మించారు. మొదటి భార్యకు ఇద్దరూ ఆడపిల్లలే పుట్టారని మొదటి భార్యకు తెలియకుండా మరో మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెకు కూడా ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. ఈమేరకు వారిద్దరిని దూరం పెట్టి మరో ముగ్గురు మహిళలతో సహజీవనం కొనసాగిస్తుండగా మొదటి భార్య లావణ్య పోలీసులను ఆశ్రయించి, ఆందోళన తెలిపింది. పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినా అతడు పద్ధతి మార్చుకోక పోగా మగ పిల్లలను ఇవ్వలేరు కాబట్టే వేరొక దారి చూసుకున్నానని చెప్పి దాడికి దిగుతున్నాడని బంధువులు వాపోతున్నారు. దీంతో ఆగ్రహించిన ఇద్దరు భార్యలు తమ బంధువులతో కలిసి కొయ్యలగూడెం వచ్చి శ్రీనివాస్ పనిచేస్తున్న ఓ ప్రైవేటు బ్యాంకుకు చేరుకుని దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారందరినీ స్టేషన్‌కు తరలించారు.

వైజాగ్‌లోని యోగాంధ్ర కమిటీలో శేషుకు స్థానం



జంగారెడ్డిగూడెం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): వైజాగ్‌లో ఈ నెల 21న నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి చింతలపూడి నియోజకవర్గం తరపున టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్రశేషుకు స్థానం కల్పించారు. శేషు మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు హాజరయ్యే అతి పెద్ద కార్యక్రమంలో తనకు చోటు కల్పించడం అదృష్టమన్నారు. చింతలపూడి నియోజకవర్గం తరపున తాను భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందన్నారు.

సాదాసీదాగా మండల పరిషత్ సమావేశం

జంగారెడ్డిగూడెం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ కొదమ జ్యోతి అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సమావేశం సాదాసీదాగా జరిగింది. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులపై రివ్యూ నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో చేపట్టాల్సిన పారిశుధ్యం, అభివృద్ధి పనులపై సమీక్ష చేపట్టారు. జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, చక్రదేవరపల్లి సర్పంచ్ సాయిల సత్యనారాయణ, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశంలో పాల్గొన్నారు.

రెవెన్యూ దినోత్సవాన్ని నేడు ఘనంగా జరుపుకోండి

ఏలూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైందని జూన్ 20న జరిగే రెవెన్యూ దినోత్సవాన్ని రెవెన్యూ అధికారులంతా ఘనంగా జరుపుకోవాలని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె. రమేశ్ కుమార్, సెక్రెటరీ ఎ.ప్రమోద్ కుమార్ తెలిపారు. ముందుగా రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న అధికారులందరికీ రెవెన్యూ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు అందించే సేవల విషయంలో రెవెన్యూ అధికారులు బాధ్యతాయుతంగా ప్రణాళికాబద్ధంగా పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని, గౌరవాన్ని నిలబెట్టుకోవాలన్నారు.

ఆర్టీసీని లాభాల బాటలో నడిపించాలి : అప్పలనాయుడు



ఏలూరు రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని లాభాల బాటలో నడిపించాల్సిన బాధ్యత ఆర్టీసీ ఉద్యోగులపై ఉందని ఆక్యుపెన్సీని పెంచేలా అధికారులు కృషి చేయాలని ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు సూచించారు. ఏపీఎస్ ఆర్టీసీ ఏలూరు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారిణిగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.కె.షబ్నం గురువారం ఏలూరులోని జోనల్ చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో రెడ్డి అప్పలనాయుడును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ ఆర్టీసీ అభివృద్ధికి ఉద్యోగులే మూల కారణమన్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారి గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. ఆర్టీసీ ఏలూరు డిపో మేనేజర్ వాణి, పీఆర్వో నరసింహం పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో యువనేత రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలను జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. రాహుల్ గాంధీ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నాయకత్వం అందించ గల సమర్థుడన్నారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు ప్రతాప సుబ్రహ్మణ్యశర్మ, తాళ్ళూరి చక్రవర్తి, చక్కా గుప్తా, లంకా రామ్మోహన్, బాబూ ప్రసాద్, వెంకట రమణ, తీడ సత్యనారాయణ, డి.చంద్రశేఖర్, వి.వెంకటేశ్వరరావు, సుబ్బారావు, కందికుప్ప వెంకటేశ్వరరావు, సేవాదళ్ సుబ్బారావు, కె.ఎస్.ఎన్.మూర్తి పాల్గొన్నారు.



సీపీఐ కార్యాలయంలో పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి

ఏలూరుకార్పొరేషన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ ఏలూరు ఏరియా ఆరవ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఏలూరులోని సీపీఐ కార్యాలయంలో 21, 22 తేదీల్లో ఏలూరు ఏరియా ఆరవ మహాసభలు జరుగుతాయన్నారు. జిల్లా మహాసభలు జూలై 5,6,7 తేదీల్లో చింతలపూడిలో జరుగుతాయన్నారు. రాష్ట్ర మహాసభలు ఆగస్టులో ఒంగోలు పట్టణంలో, జాతీయ మహాసభలు చండీగర్‌లో జరుగుతున్నాయన్నారు. సీపీఐ నాయకులు కురెళ్ళ వరప్రసాద్, కొంపల్లి కృష్ణమాచార్యులు, అడ్డగర్ల లక్ష్మీ ఇందిర, మావూరి విజయ, కొల్లూరి సుధారాణి, గొర్లి స్వాతి, వెదురుపర్తి శారద, లక్కోజు రాజేశ్వరి, భజంత్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉద్యోగులంతా సమన్వయంతో పనిచేయాలి

కామవరపుకోట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని శాఖలు అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని కామవరపుకోట ఎంపీడీవో కె.సరళకుమారి పిలుపునిచ్చారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉద్యోగులంతా బాధ్యతగా విధులు నిర్వహించి ప్రగతి సాధించాలన్నారు. మండల విద్యాశాఖాధికారి డి.సుబ్బారావు, జడ్పీటీసీ కడిమి రమేష్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు తమ్మిశెట్టి గిరిజారాణి పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బకాయిలు వెంటనే చెల్లించాలి



టి.నర్సాపురం, జూన్19(ఆంధ్రజ్యోతి): మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం(పీకేఎంయూ) టి.నర్సాపురం మండల కార్యదర్శి తాడిగడప జయరాజు డిమాండ్ చేశారు. అర్లంపాలెం పంచాయతీలో ఉపాధిహామీ పథకం పని ప్రదేశంలో గురువారం సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకంకు నిధులు తగ్గించి పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్రలు చేస్తోందన్నారు. ప్రతీ ఉపాధి కార్మికుని సంవత్సరానికి 200రోజులు పని దినాలుకల్పించి రోజుకు రూ.700 కనీస కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. జాబ్‌కార్డు కలిగి ఉండి ఉపాధి కల్పించని కూలీలకు సంవత్సరానికి 12వేలు ఉపాధిభృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా కూలీలకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.



ఆందోళన నిర్వహిస్తున్న నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ కార్మికులు

నెల రోజులుగా నిరసన తెలుపుతున్నా.. పట్టించుకోరా

ఏలూరుటూటౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలంటూ గత 34 రోజులుగా నిరసనలు, ధర్నాలు, ర్యాలీలు చేస్తున్న పట్టించుకోరా అని నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద కార్మికులు చేస్తున్న సమ్మె 34వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఇఫ్టూ ఉభయ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ సిబ్బందికి కనీసవేతనాలు రూ.29వేలు ఇవ్వాలన్నారు. హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలన్నారు. సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 23వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్త సమ్మె నిర్వహిస్తామన్నారు. నగర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ఎం.అప్పారావు, రాంబాబు, వీరినాయుడు, ఎం.వెంకట్రమణ పాల్గొన్నారు.

ఏజెన్సీ..జల్లెడ!

(మూడో పేజీ తరువాయి)

స్క్వాడ్‌లు, స్నిపర్ డాగ్స్ (పేలుడు పదార్థాలను పసిగట్టే పోలీసు జాగి లాలు)లతో ఏజెన్సీ ప్రాంతంలో ముమ్మరంగా తనిఖీలు జరుపుతూనే ఉన్నారు. అల్లూరు సీతా రామరాజు జిల్లా మారేడుమిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కింటుకూరు అటవీ ప్రాంతంలో ఈనెల 18న జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు, ఏవోబీ కార్యదర్శి గాజర్ల రవి అలియాస్ ఉదయ్, ఏవోబీ కమిటీ సీనియర్ సభ్యురాలు రావి వెంకటగిరి చైతన్య అలియాస్ అరుణ, మరో నక్సలైట్ మంజు ఎన్‌కౌంటర్ అయ్యారు. ఈ నేపథ్యంలో గోదావరికి ఇటువైపు ఏలూరు జిల్లా ఉండడంతో షెల్టర్ జోన్‌గా ఈ జిల్లాకు మావోయిస్టులు వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా పోలవరం అటవీ ప్రాంతంలో పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టారు. పోలవరం పరివాహక ప్రాంతాల్లో లాంచీలను తనిఖీలు చేస్తున్నారు. లాంచీల్లో ప్రయాణిస్తున్న వారి వివరాలను తెలుసుకుని వారి గుర్తింపు కార్డులను పరిశీలిస్తున్నారు. మొత్తం మీద కగార్ ఆపరేషన్‌తో కొనసాగుతున్న ఎన్ కౌంటర్ల వల్ల జిల్లా పోలీస్ యంత్రాంగం పూర్తి అప్రమత్తమైంది.



చిన్నారులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న దృశ్యం



పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

లింగపాలెం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సింగగూడెం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పువ్వుల ఆంజనేయులు ఆధ్వర్యంలో విద్యార్థులకు సర్వేపల్లి రాధా కృష్ణన్ విద్యామిత్ర కిట్‌లు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ బొంతురాంబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. విద్యాకిట్లను భగవద్గీతగా భావించి చక్కగా వినియోగించుకోవాలన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని పాఠశాలలో గత ఏడాది కంటే మంచి ఫలితాలను తీసుకురావాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు, పిఆర్‌టియూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, ఉపాధ్యాయులు నీలం అంజలీదేవి, ఎ.అప్పారావు, ఎం.రేఖ పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: బాలాజీనగర్‌లోని ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులకు గురువారం టీడీపీ నాయకులు విద్యామిత్ర కిట్‌లను పంపిణీ చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు పి.రామకుమార్, మద్దిపాటి నాగేశ్వరరావులు మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. హెచ్‌ఎం గంగరాజు, ఎస్‌ఎంసీ చైర్మన్ మంగ రాజు, వార్డు అధ్యక్షుడు కొత్తూరి సత్తిబాబు, నాగేశ్వర రావు, పవన్, అంజి, రాంబాబు, ప్రభాకరరావు పాల్గొన్నారు.

రెండు పూటలా స్వచ్ఛమైన తాగునీరందిస్తాం



ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

ఏలూరుటూటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు రెండుపూటలా స్వచ్ఛమైన తాగునీటిని సమృద్ధిగా అందిస్తున్నామని నగర కమిషనర్ భానుప్రతాప్, కోఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబు తెలిపారు. గురువారం నగరానికి తాగునీరందించే పంపుల చెరువు ప్రాంగణాన్ని సందర్శించారు. వారు ఇరువురు మాట్లాడుతూ పంపుల చెరువు ప్రాంగణంలో 30ఎంఎల్‌డీ, 8ఎంఎల్‌డీ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లు ఉన్నాయన్నారు. కృష్ణా జలాలతో వీటిని నింపి శుద్ధి చేసి తాగునీరు అందిస్తున్నామని అన్నారు. దెందులూరు వద్ద 117ఎకరాల్లో ఉన్న తాగునీటి చెరువును గోదావరి జలాలతో నింపి శుద్ధి చేసి సరఫరా చేస్తున్నామన్నారు. ప్రతి మనిషికీ రోజుకు 135 లీటర్ల చొప్పున తాగునీందరిస్తున్నామన్నారు. ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనితీరు, క్లోరినేషన్, ఫిల్టర్ బెడ్స్ క్లీనింగ్, వేస్ట్ వాటర్ వెళ్లే విధానాన్ని పరిశీలించామన్నారు. కార్యక్రమంలో ఎంఈ సురేంద్రబాబు, నారాయణ, సాంబశివరావు, పవన్ పాల్గొన్నారు.

యోగాంధ్రపై ఎమ్మెల్యే ధర్మరాజు సమీక్ష

ఉంగుటూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో స్వర్ణాంధ్ర విజన్ 2047 కార్యాచరణకు సంబంధించి గురువారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు నోడల్ అధికారితో పాటు ఎంపీడీవోలు, తహసీల్దార్లతో పాటు సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ప్రత్యేక అధికారుల సమన్వయంతో గ్రామ స్థాయి నుంచి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. విద్య, సాగు, మౌలిక సదుపాయాలు, ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. అనంతరం కార్యాలయంలో ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి అందిన చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 149 మంది లబ్ధిదారులకు రూ.కోటి 51లక్షల చెక్కులను అందించారు. సీఎం సహాయ నిధి పేదలకు వరమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

రానున్న వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

» మండల సర్వసభ్య సమావేశంలో అధికారులకు సూచనలు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

వేలేరుపాడు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రానున్న మూడు నెలలు జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలో అధికారులంతా అప్రమత్తంగా వ్యవహరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజాప్రతినిధులు అధికారులకు సూచించారు. గురువారం వేలేరుపాడు మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగింది. ముందుగా ఆయాశాఖలకు చెందిన సంబంధిత అధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న పనులపై ప్రజాప్రతినిధులకు నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా మండల ప్రజాప్రతినిధులు, అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని అలాగే తాగునీటి సరఫరా విషయంలో పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. తాగునీటి వసతి సదుపాయం లేని గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా అయినా సురక్షిత నీటిని అందించే ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. అలాగే రానున్న మూడు నెలల్లో గోదావరికి, పెదవాగుకు వరదలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వాళ్ల లక్ష్మీదేవి అధికారులను కోరారు. వరదల సమయంలో ప్రజలకు నిత్యవసరాలు, అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సమావేశంలో ఎంపీడీఓ ఎం.శ్రీహరి, జడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా రామలక్ష్మి, పలు శాఖాధికారులు, పాల్గొన్నారు.

ఉనికిని కాపాడుకోవడానికే జగన్ విమర్శలు



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన ఉనికిని కాపాడుకోవడానికే ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ పోలీసులు చెప్పినా వినకుండా జగన్ పరామర్శల పేరిట వెళ్లి ఇద్దరి మరణానికి కారకుడయ్యాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న సమయంలో కాకుండా ప్రజలు ఇప్పుడు గుర్తుకొచ్చారా అని ప్రశ్నించారు. ఎన్నికల నాటితో పోలిస్తే జగన్ గ్రాఫ్ దారుణంగా ఉందని, వచ్చే ఎన్నికల నాటికి ఈ మాత్రం కూడా నిలబడదని, దీంతో ఉనికి కోసం పేదల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాడని అన్నారు. జగన్ ధన దాహానికి, దోపిడీకి, లిక్కర్ స్కామ్‌కు ఎంతోమంది బలయ్యారని, ఇలాంటి చర్యలకు పాల్పడినవారు శిక్ష నుంచి తప్పించుకోలేరని, జగన్ చివరికి జైలుకెళ్లక తప్పదని ప్రభాకర్ జోస్యం చెప్పారు.

ఏలూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం..



ఏలూరును పారిశుధ్య నగరంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. వర్షాకాలం నేపథ్యంలో డ్రైన్లను ఆధునీకరిస్తున్నాం. స్వచ్ఛ నగరంగా ఏలూరును తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాం. రోడ్లపై గుంతలు పూడ్చిస్తూ.. కోట్లాది రూపాయలతో రోడ్లు నిర్మిస్తున్నాం. నగరంలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందిస్తూ చెరువులు ఆధునీకరిస్తున్నామంటున్న **కమిషనర్ అన్నాప్రగడ భానుప్రతాప్**తో ఇంటర్వ్యూ..

» పారిశుధ్యంపై తీసుకున్న చర్యలేమిటి?

నగరాన్ని 16 సర్కిల్‌గా విభజించాం. 16 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లను, 646మంది పారిశుధ్య కార్మికులు, మేస్త్రీలతో మూడు షిఫ్ట్‌లలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నాం. ప్రతీ రోజు నగరంలో తడిచెత్త 55 టన్నులు, పొడిచెత్త 45టన్నులు సేకరించి పోణంగిలోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నాం. డ్వాక్రా మహిళలకు కూడా బాధ్యతలు అప్పగించాం. ప్రతీ పదేళ్లకు ఒక డ్వాక్రా మహిళను వలంటీర్‌గా నియమించాం. తన చుట్టు పక్కల పదిళ్ల యాజమానులతో తడి, పొడిచెత్తను వేరువేరుగా చేసి పారిశుధ్య సిబ్బందికి అప్పగించేలా అవగాహన కల్పిస్తున్నాం. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, డ్వాక్రా మహిళల సాయంతో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరిస్తున్నాం.

» రోడ్లను ఆధునీకరిస్తున్నారా?

నగరంలో సుమారు రూ.కోటి వ్యయంతో రోడ్లపై ఉన్న గుంతలన్నీ పూడ్చించాం. రూ.4 కోట్లతో నూతన రోడ్లను నిర్మించాం. పవర్‌పేట రైల్వేస్టేషన్ నుంచి స్వాతి మెడికల్స్ వరకు 1.28 కిలోమీటర్లు, బీర్లభవన్ సెంటర్ రోడ్డు 1.1కిలోమీటర్ రోడ్లను నిర్మించాం. మరో 5కిలోమీటర్ల రోడ్లను నిర్మిస్తున్నాం. ఇది కాక రూ.5కోట్ల అంచనాలతో నూతన రోడ్లను నిర్మించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

» పార్కుల నిర్వహణకు చేపట్టిన చర్యలు..

ప్రతీ పార్కులో పర్యవేక్షకుడిని నియమించి శుభ్రం చేస్తున్నాం. పార్కుల్లో వాటర్ ఫౌంటేన్‌లు పెట్టి చల్లదనం ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. చిన్నపిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులను ఏర్పాటు చేశాం. చాలా పార్కుల్లో పాడైన ఆట వస్తువులను బాగు చేశాం. అశోక్ నగర్ పార్కులో జిమ్ ఏర్పాటు చేశాం.

» ఖాళీ స్థలాలపై మీ చర్యలేమిటి?

వర్షాకాలం నేపథ్యంలో నగరంలో, మిగిలిన గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో ఏపుగా ఎదిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని యాజమానులను ఆదేశించాం. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉంచకుండా మట్టి నింపాలని నోటీసులిస్తున్నాం. యాజమానులు ముందుకు రాకపోతే కార్పొరేషన్ సొమ్ముతో ఖాళీ స్థలాలు బాగు చేయించి ఆ సొమ్మంతా యజమానుల నుంచి కలెక్ట్ చేస్తాం.

» పందులు, కుక్కల నిర్మూలనకు చర్యలేమిటి?

పందులను ఊరి బయట పెంచుకునేలా యజమానులకు ఆదేశాలిచ్చాం. పోణంగిలో ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేశాం. నగరంలో పందులు సంచరిస్తే యాజమానులపై చర్యలు తీసుకుంటాం. వీధి కుక్కలను పట్టుకుని ఆసుపత్రులకు తరలించి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్లు చేయించి బయటకు వదులుతున్నాం.

» నగర సుందరీకరణకు తీసుకున్న చర్యలు..

మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నాం. రోడ్ల మధ్యలో డివైడర్లపై మొక్కలు నాటుతున్నాం. పార్కుల్లో నగరలోనే అన్ని ఖాళీ ప్రదేశాల్లో ఈ వర్షాకాలంలో మొక్కలు నాటి నగరాన్ని సుందరీకరిస్తాం.

- ఏలూరు టూటౌన్



హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న అధికారులు

మద్ది ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

జంగారెడ్డిగూడెం,జూన్ 19(ఆంధ్రజ్యోతి): మద్ది ఆంజనేయ స్వామి ఆలయ హుండీలను జిల్లా దేవదాయ శాఖ, స్థానిక గోకుల తిరుమల పారిజాత గిరి వెంకటేశ్వర స్వామి దేవస్థాన ఈవో కలగర శ్రీనివాస్ పర్యవేక్షణలో గురువారం లెక్కించారు. 85 రోజులకు దేవాలయ హుండీల ద్వారా రూ.53,90,109, అన్నదాన హుండీ ద్వారా రూ.81,370 మొత్తం రూ.54 లక్షల 71 వేల 479 ఆదాయం సమకూరినట్టు దేవస్థానం ఈవో ఆర్.వి.చందన తెలిపారు.



సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న దృశ్యం

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

ఏలూరుటూటౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదల పాలిట సంజీవని అని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలో అసెంబ్లీ నియోజకవర్గంలో 2కోట్ల 22 లక్షల 81వేల విలువైన చెక్కులను పంపిణీ చేశామన్నారు. గురువారం 25మంది లబ్ధిదారులకు 16లక్షల రూపాయల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశామన్నారు. పేదలు అనారోగ్యం పాలైనప్పుడు ఆర్థిక భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. భవిష్యత్తులో పేదల వైద్యానికి ఎన్నికోట్లు అవసరమైన ఖర్చు చేయడానికి వెనకాడేది లేదన్నారు. మాజీ మంత్రి మరడాని రంగారావు, కోఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్‌ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు.

తల్లికి వందనం, అన్నదాత సుఖీభవపై రీ సర్వే

ఉంగుటూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తల్లికి వందనం,అన్నదాత సుఖీభవ లబ్దిదారుల అర్హత విషయంలో రీ-సర్వే చేయ నున్నట్టు రెవెన్యూ అధికారి వై.పూర్ణచంద్ర ప్రసాద్ తెలిపారు.



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

సానా సతీశ్ బాబు ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

ఏలూరు రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యులు, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి సానా సతీశ్ బాబు పుట్టినరోజు వేడుకలు గురువారం సానా సతీశ్ బాబు ఫౌండేషన్ సభ్యులు, జిల్లా బీసీ నాయకులు మారగాని చంద్రకిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బావిశెట్టిగారు పేటలోని శ్రీవల్లిదేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో తొలుత ఆయుష్, మృత్యుంజయ హోమం నిర్వహించారు. మారగాని చంద్రకిరణ్ లక్ష్మీ కుమారి దంపతులు, రాజనాల సాయి కిరణ్ కుమార్, రాజ్యలక్ష్మి దంపతులు హోమంలో పాల్గొన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిథిగా పాల్గొని సానా సతీష్ ఫౌండేషన్ సేవలను కొనియాడారు. డివిజన్ కార్పొరేటర్ జున్నూరు నరసింహరావు, టీడీపీ నాయకులు నాగులపల్లి గంగాధరరావు, మేకల సీతారామయ్య, నందు, శంకభత్తుల నాగరాజు, వెంపల అనీల్, గుండు శివాజీ, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

యోగాంధ్రను జయప్రదం చేయండి

ఏలూరు అర్బన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ యోగా బోధకులు ఆది నారాయణ మాట్లాడుతూ యోగాసనాల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ప్రిన్సిపాల్ గిరి బాబు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

● లింగపాలెం: నిత్య జీవితంలో యోగా భాగం కావాలని, యోగా చేసేందుకు కొంత సమయాన్ని కేటాయించాలని ఎంపీడీవో కె.వాణి అన్నారు. లింగపాలెంలో నిర్వహించిన యోగాంధ్రలో పాల్గొని మాట్లాడుతూ 21న జరగబోయే యోగాంధ్రలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. మండలంలో 7,926 మందికి యోగాదినోత్సవం రోజున సర్టిఫికెట్లు అందిస్తామన్నారు.

● జీలుగుమిల్లి: విశాఖలో ఈ నెల 21న జరిగే 11వ అంతర్జాతీయ యోగాంధ్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. నియోజకవర్గ ప్రజలు కూటమి నాయకులు భాగస్వాములు కావాలన్నారు.



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

టీడీపీ కమిటీలు పూర్తి చేయాలి

జీలుగుమిల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు కార్యకర్తలు సమన్వయంతో నూతన కమిటీలు ఏర్పాటు చెయ్యాలని మండల పరిశీలకులు రావూరి కృష్ణ అన్నారు. జీలుగుమిల్లిలో టీడీపీ మండలాధ్యక్షులు సుంకవల్లి సాయి ఇంటి వద్ద గురువారం సమావేశం జరిగింది. పార్టీ నాయకులతో కృష్ణ మాట్లాడుతూ ఇప్పటికే 8పంచాయతీల్లో కమిటీల నియామకం పూర్తి చేసినట్టు తెలిపారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపుతో పాటు పదవులు దక్కుతాయన్నారు. ఎంపీటీసీ నాలి శ్రీను, పూసం ఉదయ్ కుమార్, సర్పంచ్ వనమ రాంబాబు, ముప్పిడి సురేష్, చిర్రి వెంకటేశ్వరావు, వెలగల అజయ్, గద్దె సుబ్రమణ్యం, పేరుబోయిన దాము, తోట బాలు, చాపా రవి, గారపాటి శ్రీను, పైడిమాల కృష్ణ, దొంగ మురళి, శీమకుర్తి శ్రీనివాస్, పీతల వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

ఇద్దరికి నవోదయం ఉపాధి రుణాలు

చింతలపూడి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నవోదయం 2.0లో భాగంగా సారా వ్యాపారం మానేసిన చింతలపూడి సర్కిల్లోని ఇద్దరికి కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారిణి శ్రీలత సమక్షంలో డీఆర్‌డీఏ ద్వారా ప్రత్యామ్నాయ ఉపాధి పథకం కింద ఒక్కొక్కరికి రూ.50 వేల రుణం అందించినట్టు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ తెలిపారు. కంచనగూడెం గ్రామానికి చెందిన చావా నాగ రాజు, తలార్లపల్లి గ్రామానికి చెందిన ఇస్లావత్ తిరుపతమ్మ ఒక్కొక్కరికి 50 వేల రూపాయల రుణాలను అందించారు.

సాగుదారుల చట్టంపై అవగాహన

ఏలూరుటూటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పంట సాగుదారుల చట్టంపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ జేడీ ఎస్.కె.అబిబ్ బాష అన్నారు. పంటసాగుదారుల చట్టం ప్రచార ఉద్యమం కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా జేడీ అబిబ్ బాషా మాట్లాడుతూ భూమి ఉన్న రైతులకు, కౌలు రైతులకు 11నెలల పాటు సీసీఆర్‌సీ కార్డు పని చేస్తుందన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ సింగవరపు జ్యోతి మాట్లాడుతూ సాగుదారుల చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు.ఎస్సీ, ఎస్టీ, రైతులు, కౌలు రైతులు గుర్తింపు కార్డులను పొందడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందవచ్చన్నారు. సింగవరపు జ్యోతి, గోశాల రూన్సీ, భలే సురేశ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కుక్కునూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణం పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు కారం దారయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కుక్కునూరులో మీడియాతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు వర్తింపజేయాలన్నారు. ప్రతీ నెల 5వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల మెనూధరను పెంచి సరుకులను ప్రభుత్వమే నేరుగా అందజేయాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు కొన్నే లక్ష్మయ్య, కె.బాబూరావు, వి.పాపారావు, వి.శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎస్.ఐగా కుటుంబరావు



జంగారెడ్డిగూడెం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ ఎస్.ఐ.గా ఎం.కుటుంబరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చింతలపూడి లా అండ్ ఆర్డర్ ఎస్.ఐగా పనిచేసి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు ట్రాఫిక్ ఎస్.ఐగా వచ్చారు.ఇక్కడ ట్రాఫిక్ ఎస్.ఐగా పనిచేసిన ఆర్.రాంబాబు వీఆర్‌లో ఉన్నారు.

చికెన్ వ్యర్థాల వాహనం స్వాధీనం

పెదపాడు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాల తరలిస్తుండగా పెదపాడు మండలం ముప్పర్రు పంచాయతీ అందేఖాన్ చెరువు వద్ద తనిఖీలు నిర్వహించి ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు పెదపాడు ఎస్.ఐ. కట్టా శారద సతీశ్ తెలిపారు. వాహనాన్ని, వాహనంలోని సుమారు 10 వేల కిలోల చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకుని, వాహన యజమాని, డ్రైవర్, చెరువు యజమానులపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిచిపోయే ప్రాంతాలివే

పెదవేగి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): విజయరాయి సెక్షన్ పరిధిలోని జానంపేట విద్యుత్ ఉపకేంద్రం జానంపేట, జగన్నాథపురం, బి.సింగవరం, ముత్తనవీడు గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఈఈ అంబేడ్కర్ తెలిపారు.

కూచింపూడి ఉపకేంద్రం పరిధిలో..

కూచింపూడి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో కూచింపూడి, గోవిందవారిగూడెం, న్యాయంపల్లి గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆయా గ్రామాల్లో శుక్రవారం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అంబేడ్కర్ కోరారు.

22న అన్నమాచార్యుల సంగీత గానం

ఏలూరు రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక గరికపాటి ఆర్ట్స్ థియేటర్స్ 275వ కార్యక్రమములో భాగంగా ఈనెల 22వ తేదీన స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్యమండలి ప్రాంగణంలో సాయంత్రం శాస్త్రీయ, చలనచిత్ర గాయకురాలు ముక్కామల శ్రీవల్లిచే అన్నమాచార్య సంకీర్తనల గానం ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ నిర్వాహకులు గరికపాటి కాళిదాసు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం సీనియర్ శాస్త్రీయ సంగీత విద్వాంసులు, ముక్కామల భామామణికి ఆత్మీయ సత్కారం చేయనున్నట్లు తెలిపారు. కళాభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పుల్లాబోట్ల పురుషోత్తమరావు విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్ల పంపిణీ

కలిదిండి, జూన్19(ఆంధ్రజ్యోతి):తాడినాడ జడ్పీ హైస్కూల్ గురువారం పాఠశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రూ.14 వేలు విలువ గల భోజనం ప్లేట్లను బొడ్డు వెంకటరమణ, వెంకటరత్నం, కుమార్ పంపిణీ చేశారు. ఆర్ఎంపీ డాక్టర్ వైసీపీ. నాగరాజు రూ.20 వేలు విలువ గల కరెంట్ సర్వీసు వైరు, మోటార్‌ను అందించారని హెచ్ఎం జి.వి.రమణ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కె.సింహాద్రి అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ముసునూరు గురుకుల బాలికల యోగా విన్యాసాలు

యోగాంధ్ర మహాయజ్ఞం

ముదినేపల్లి, జూన్19(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పిలుపుమేరకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమం మహాయజ్ఞమని ఆర్ట్ ఆఫ్ లివింగ్ కోచ్ కె.రఘురామ్ గురూజీ అన్నారు. ముదినేపల్లిలోని విజయ ఫార్మసీ కళాశాలలో గురువారం నిర్వహించిన యోగాసనాల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో యోగా కార్యక్రమాలను నెల రోజులపాటు నిర్వహించి ఈనెల 21న విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించడం చారిత్రాత్మక ఘట్టమని అన్నారు. ఈ సందర్భంగా కోచ్ రఘురామ్‌ను ఫార్మసీ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు సన్మానించారు. పాలి టెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారావు, డీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణమూర్తి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల బాలికల యోగా విన్యాసాలు

ముసునూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ముసునూరు గురుకుల పాఠశాల బాలికలు గురువారం యోగా విన్యాసాలతో అలరించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న గురుకుల పాఠశాలలో మండల స్థాయిలో జరిగే యోగా వేడుకలకు పీఈటీ నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో బాలికలను సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ తరఫున బాలికలతో యోగా ప్రాక్టీస్ చేయించి, ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ యోగా డే వేడుకలు ఘనంగా నిర్వహించేలా సకల ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.లక్ష్మీకుమారి తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో యోగాంధ్ర

ముదినేపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని సింగరాయపాలెం - చేవూరు పాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి ఆధ్వర్యంలో సిబ్బంది, అర్చకులు, గ్రామస్థులు పాల్గొని పలు రకాల యోగాసనాలు వేశారు. యోగా మాస్టర్ వై.జ్యోతి ఆసనాల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు.



ముదినేపల్లి ఫార్మసీ కాలేజీలో కోచ్ రఘురామ్, అధ్యాపకులు, విద్యార్థుల యోగాసనాలు



సింగరాయపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో యోగాసనాలు



ముసునూరు గురుకుల బాలికల యోగా విన్యాసం

రహదారుల వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలు నివారించాలి : ఎమ్మెల్యే కామినేని

కైకలూరు : రహదారుల వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు పంచాయతీ అధికారులు తీసివేయాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంపై ఎంపీడీవోలకు, పంచాయతీ కార్యదర్శులకు సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఈనెల 21న జరిగే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతోపాటు ప్రతీ గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, మాజీ ఎంపీపీ నర్సిపల్లి అప్పారావు, పలు పాఠశాలల హెచ్ఎంలు, కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



ముదినేపల్లి సమావేశంలో మాట్లాడుతున్న వాణి శివప్రసాద్

చంద్రబాబు నాయకత్వంపై పూర్తి విశ్వాసం

ముదినేపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తి విశ్వాసం ఏర్పడిందని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, కైకలూరు నియోజకవర్గ పార్టీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు పెద్దిబోయిన వాణి శివప్రసాద్ అన్నారు. ముదినేపల్లి మండలం తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలు, నూతన కమిటీల ఏర్పాటుపై గురువారం స్థానిక వి-కన్వెన్షన్ హాలులో నిర్వహించిన మండల పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల వాగ్దానాలు అమలు చేయడంపై కార్యకర్తలు ప్రజలకు వివరించాలని కోరారు. చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి అవసరమన్నది కూడా ప్రజలు గుర్తించే విధంగా వ్యవహరించాలన్నారు. పార్టీ గ్రామ, మండలస్థాయి కమిటీల ఏర్పాటులో నాయకులు, కార్యకర్తలు ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ళ శోభనాద్రిచౌదరి, ఏలూరు లోక్‌సభ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు రెడ్డి సూర్యచంద్రరావు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, పార్టీ నాయకులు చలసాని జగన్మోహనరావు, కొత్తూరు విఠల్, పోసిన పాండురంగారావు, బొంగు రవికుమార్, రాజు, యర్రా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలను నేరుగా నా దృష్టికి తీసుకురండి'



సెక్టార్ లీడర్లతో మాట్లాడుతున్న సీడీపీవో విజయకుమారి

నూజివీడు టౌన్, జూన్ 19 (ఆంధ్ర జ్యోతి) : అంగన్‌వాడీ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని నూజివీడు సీడీపీవో పి.విజయకుమారి అన్నారు. నూజివీడు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సెక్టార్ లీడర్లతో ఆమె గురువారం సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో అద్దె, సొంత అంగన్‌వాడీ భవనాలలో మౌలిక సదుపాయాలకు సంబంధించి పూర్తిస్థాయి సమాచారాన్ని అందించాలన్నారు. చిన్నారులు, బాలింతలు గర్భిణుల సమాచారాన్ని యాప్‌లో పొందుపరిచే విషయంలో ఏమైనా సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైతే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని సెక్టార్ లీడర్లు పాల్గొన్నారు.



వలసపల్లిలో రైతులకు సూచనలిస్తున్న అధికారులు

పంటల్లో సస్యరక్షణ చర్యలపై అవగాహన ఉండాలి

ముసునూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ రైతులు సాగుచేసే పంటల్లో సస్యరక్షణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలని ఏలూరు డీఆర్‌సీ కేంద్రం వ్యవసాయ అధికారిణి ఎం.ఉషారాణి, ఏవో ఎ.చాముండేశ్వరి అన్నారు. గురువారం వలసపల్లిలో జరిగిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో రైతులకు ఖరీఫ్ వ్యవసాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూసార పరీక్షలు, పచ్చిరొట్ట ఎరువుల వల్ల ఉపయోగాలు, అన్నదాత సుఖీభవ పథకం విధివిధానాలపై రైతులకు వారు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి ఇంకా ఈకేవైసీ చేయించుకోని రైతులు రైతుసేవా కేంద్రాలకు వెళ్లి ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు. రైతులు, టీడీపీ నాయకులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

30 నుంచి ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్



నూజివీడు టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా నూజివీడులోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ పరిధిలో గల నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్‌కు సంబంధించి 4,400 సీట్ల భర్తీకి గాను కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల 30 నుంచి జూలై 5 వరకు నిర్వహిస్తున్నట్టు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, అడ్మిషన్స్ కన్వీనర్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలోని ఆర్కే వ్యాలీ మినహా మిగిలిన మూడు క్యాంపస్‌లకు నూజివీడు కేంద్రంగా కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. ఎంపిక చేసిన విద్యార్థుల వివరాలను ఈనెల 23వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు వెబ్‌సైట్లో ఉంచడంతో పాటు, విద్యార్థులకు నేరుగా మెసేజ్‌లను పంపిస్తామన్నారు. నూజివీడు క్యాంపస్‌కు నూజివీడులోనూ, ఆర్కే వ్యాలీ క్యాంపస్‌కు సంబంధించి ఆర్కే వ్యాలీలోను జూన్ 30, జూలై ఒకటో తేదీల్లో కౌన్సిలింగ్ నిర్వహిస్తుండగా శ్రీకాకుళం క్యాంపస్‌కు సంబంధించి జూలై రెండు, మూడు తేదీలలో, ఒంగోలు క్యాంపస్‌కు సంబంధించి జూలై 4,5 తేదీల్లో నూజివీడు క్యాంపస్‌లో, కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులు జూలై 14వ తేదీ సంబంధిత క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.



నరసింహారావుపాలెంలో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న సర్పంచ్ ప్రశాంతి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చాట్రాయి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభమైనందున ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాప్రసాద్ సూచించారు. మండలంలోని చనుబండ, నరసింహారావుపాలెం గ్రామాల్లో గ్రామ పంచాయతీలు, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం దోమల నివారణ మందు పిచికారీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాప్రసాద్ ప్రజలతో మాట్లాడుతూ ఇళ్లల్లో వచ్చిన చెత్తను డ్రెయిన్లలో పారవేయవద్దని విజ్ఞప్తి చేశారు. డ్రెయిన్లు, మురుగు కుంటల్లో దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. జాగ్రతలు తీసుకుంటే వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జ్యోతి, ప్రశాంతి, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



బొమ్మినంపాడులో విద్యామిత్ర కిట్లు అందజేస్తున్న నాయకులు

విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు పంపిణీ

ముదినేపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బొమ్మినంపాడు జిల్లా పరిషత్ హైస్కూలులో గురువారం విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, విద్యామిత్ర కిట్లను ఎన్డీఏ నాయకులు పంపిణీ చేశారు. టీడీపీ మండల ఉపాధ్యక్షుడు యర్రా రాంబాబు, నీటి సంఘం అధ్యక్షుడు కేనం ప్రసాద్, జనసేన నాయకుడు బాసినశెట్టి కిషోర్, హెచ్ఎం సత్యప్రసాద్ తదితరులు పుస్తకాలను అందజేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని నాయకులు కోరారు.

కాలువ వెంబడి ఆక్రమణలు తొలగించాలి

కలిదిండి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మూల్లంక-పెదలంక కాలువ వెంబడి ఉన్న ఆక్రమణలను తొలగించాలని కోరుతూ కలెక్టర్ వెట్రిసెల్వికి గ్రామస్థులు అర్జీ సమర్పించారు. మూల్లంకలో కాలువకు ఇరువైపులా అక్రమ కట్టడాలు నిర్మించడంతో కాల్వ పూడిపోవడంతో దిగువన ఉన్న పెదలంక గ్రామానికి సాగు, తాగునీరు చేరడం లేదని పేర్కొన్నారు. పలు మార్లు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయగా, వారు తహసీల్దార్ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా, ఇంతవరకు ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టలేదన్నారు. కాల్వలకు సాగు, తాగునీరు విడుదల చేసినప్పటికీ మూల్లంకలో కాల్వ వెంబడి అక్రమ కట్టడాల కారణంగా పెదలంకకు సాగు, తాగునీరు సరఫరాకు ఆటంకం కలుగుతుందని సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కాల్వ గట్టుపై ఉన్న అక్రమ కట్టడాలను తొలగించాలని గ్రామస్థులు వాతాడి రామకృష్ణ, ఎన్.గణపతి, వాటాల పోతురాజు, చాబత్తిన శ్రీనివాసరావు కోరుతున్నారు. అమరావతి, సంతోషపురం, భాస్కరావుపేట, మూల్లంక గ్రామాల్లో కాలువ గట్టుపై ఉన్న నివాసితులు వ్యర్థాలను కాల్వలో వేసి నీటిని కలుషితం చేస్తున్నారని పేర్కొన్నారు. సాగు, తాగునీటిని కలుషితం చేస్తున్న నివాసితులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు



కిరణ్‌బాబు (ఫైల్)

ముదినేపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మద్యంతో పాటు పలు వ్యసనాలకు బానిసైన ఓ యువకుడు ఇంటి నుంచి వెళ్లిపోయి మూడు నెలలుగా కనిపించని ఘటన నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాలివి.. ముదినేపల్లి మండలం పెదగొన్నూరు శివారు కర్షకమాలపల్లికి చెందిన మద్దాల కిరణ్‌బాబు పలు మిఠాయి దుకాణాల్లో పనిచేస్తూ ఉండేవాడు. తనకు వచ్చే సొమ్ము చాలక తల్లిని డబ్బులు డిమాండ్ చేసేవాడు. ఇవ్వకపోతే దుర్భాషలాడేవాడు. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది మార్చి 30న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటినుంచి అతడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో గురువారం తల్లి మరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.



రహదారి ప్రారంభోత్సవానికి స్వాగతం పలుకుతున్న మహిళలు

రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం

» ఎమ్మెల్యే డాక్టర్ కామినేని

కైకలూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని, ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులను ప్రభుత్వం ఖర్చు చేసిందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం కైకలూరు ఎస్వీవోస్ కాలనీలో రెండు సీసీ రహదారులను, జర్నలిస్టుల కాలనీలో మూడు సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. కైకలూరు-కలిదిండి రహదారి అభివృద్ధికై రూ.3 కోట్ల వ్యయంతో నిర్మాణపనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ గ్రామంలోనూ రహదారుల నిర్మాణాన్ని చేపడతామని ఇప్పటికే కైకలూరు, కలిదిండి ఆర్అండ్‌బీ రహదారిలో అడవి నాయుడు సెంటర్ నుంచి పుల్లవా డ్రెయిన్ వరకు ఆర్అండ్‌బీ రహదారిని సీసీ రోడ్డుగా మారుస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, వార్డు సభ్యుడు కేవీఎస్ఎం నాయుడు, పిచ్చుకల శివరమ్య, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్, డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు, పలు శాఖ అధికారులు పాల్గొన్నారు.

మహిళా మండల భవన నిర్మాణానికి భూమిపూజ

కైకలూరు ఎస్వీవోస్ కాలనీలో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆయన తల్లి రాజేశ్వరమ్మ జ్ఞాపకార్థం మహిళా మండలి భవనాన్ని సొంత ఖర్చులతో నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం భూమిపూజ చేశారు.



గురుకుల బాలికలకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎస్ఎంసీ చైర్మన్ తదితరులు

విద్యార్థులకు నాణ్యమైన విద్యే లక్ష్యం

ముసునూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉచిత సదుపాయాలతో పాటు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎస్ఎంసీ చైర్మన్ సాయిల పంగిడియ్య, వైస్ చైర్మన్ రాధిక అన్నారు. గురువారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు, డిక్షనరీలను గురుకుల బాలికలకు వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, ఇతర సామగ్రిని సైతం ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యతో విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేస్తోందన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తుందన్నారు. కూటమి పాలనలోనే విద్యారంగం మరింత బలోపేతం అవుతుందన్నారు. ఉచిత సదుపాయాలు, నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ కె.లక్ష్మీకుమారి, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువకుడిపై బైండోవర్ కేసు

ముదినేపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం కొత్తపల్లి క్రాస్‌రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న యోబు అనే యువకుడిని బుధవారం తెల్లవారు జామున పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి ఆటోలో 25 లీటర్ల మూడు ప్లాస్టిక్ క్యాన్లు ఉండడం అతడు చెప్పిన విషయంపై అనుమానం కలగడంతో రాత్రి గస్తీ తిరుగుతున్న ముదినేపల్లి పోలీస్ సిబ్బంది యోబును అదుపులోకి తీసుకుని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్టు ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.


ఆకాశం మేఘావృతం

మొక్క దశలో వెదజల్లిన విత్తనాలు.. రైతుల్లో ఆందోళన



గోపాలపురంలో వరి చేలు

కలిదిండి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులతో ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట పొలాల్లో విత్తనాలను వెదజల్లారు. మొక్క దశలో ఉన్నాయి. పలు గ్రామాల్లో విత్తనాలు వెదజల్లుతున్నారు. ఈ పరిస్థితుల్లో భారీ వర్షాలు కురిస్తే పంట పొలాలు నీటమునిగి విత్తనాలు మొలకెత్తకుండాపోయే ప్రమాదం ఉందని, మొలకెత్తిన మొక్కలు కూడా కుళ్లిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోరుకొల్లు, సానారుద్రవరం, వెంకటాపురం, గోపాలపురం గ్రామాల్లో సుమారు నాలుగు వేలు ఎకరాల్లో విత్తనాలను వెదజల్లారు.



కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో తొలగించని జగనన్న గోరుముద్ద బోర్డు

'జగనన్న గోరుముద్ద బోర్డు తొలగించాలి'

కలిదిండి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో ఉన్న జగనన్న గోరుముద్దు మధ్యాహ్న భోజన పథకం పేరిట ఉన్న బోర్డును తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినప్పటికీ ఇంత వరకు జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక బోర్డును తొలగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం బోర్డు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



మండవల్లిలో పైపులైన్ల పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ ఝాన్సీసురేష్

పైపులైన్ల నిర్మాణం నాణ్యతగా చేపట్టాలి

మండవల్లి జూన్ 19(ఆంధ్రజ్యోతి): పైపులైన్ల నిర్మాణం నాణ్యతగా చేపట్టాలని సర్పంచ్ మెండ ఝాన్సీ సురేష్‌బాబు అన్నారు. గురువారం మండవల్లిలో జలజీవన్ మిషన్ ద్వారా జరుగుతున్న మంచినీటి పైపులైన్ పనులను ఆమె పరిశీలించారు. పనులు నిర్వహణ వేగవంతంగా చేయాలని పైపులైన్ నిర్మాణంలో ఎలాంటి లోపాలు లేకుండా నిర్మాణం సూచించారు.

ఏజెన్సీ..జల్లెడ!

(ఐదో పేజీ తరువాయి)

స్పాడ్‌లు, స్నిపర్ డాగ్స్ (పేలుడు పదార్థాలను పసిగట్టే పోలీసు జాగిలాలు)లతో ఏజెన్సీ ప్రాంతంలో ముమ్మరంగా తనిఖీలు జరుపుతూనే ఉన్నారు. అల్లూరు సీతా రామరాజు జిల్లా మారేడుమిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కింటుకూరు అటవీ ప్రాంతంలో ఈనెల 18న జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు, ఏవోబీ కార్యదర్శి గాజర్ల రవి అలియాస్ ఉదయ్, ఏవోబీ కమిటీ సీనియర్ సభ్యురాలు రావి వెంకటగిరి చైతన్య అలియాస్ అరుణ, మరో నక్సలైట్ మంజు ఎన్‌కౌంటర్ అయ్యారు. ఈ నేపథ్యంలో గోదావరికి ఇటువైపు ఏలూరు జిల్లా ఉండడంతో షెల్టర్ జోన్‌గా ఈ జిల్లాకు మావోయిస్టులు వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా పోలవరం అటవీ ప్రాంతంలో పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టారు. పోలవరం పరివాహక ప్రాంతాల్లో లాంచీలను తనిఖీలు చేస్తున్నారు. లాంచీల్లో ప్రయాణిస్తున్న వారి వివరాలను తెలుసుకుని వారి గుర్తింపు కార్డులను పరిశీలిస్తున్నారు. మొత్తం మీద కగార్ ఆపరేషన్‌తో కొనసాగుతున్న ఎన్ కౌంటర్ల వల్ల జిల్లా పోలీస్ యంత్రాంగం పూర్తి అప్రమత్తమైంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	